Email:prajamantalu@gmail.com

www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 135

పేజీలు - 8 వెల- రూ 5 : 00

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

బుధవారం 15, నవంబర్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## కరీంనగర్‌లో వెలమ సామాజిక వర్గానిదే ఆధిపత్యం



2లో..

- వ్యవసాయ స్థిరీకరణకై రైతుబంధు తెచ్చాం
- తెలంగాణ వచ్చిన్నాడు గందరగోళ పరిస్థితులు
- ఇయ్యాల బ్రహ్మాండమైన సదుపాయాలు
- రైతులు 10హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటడా?
- ఈ మోటర్ ఎవరు కొనివ్వాలె..
- తెలంగాణలో 30లక్షల పంపుసెట్లు ఉన్నయ్
- ఇబ్రహీపట్నం ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- మళ్లీ రూ.5వేల పెన్షన్ పెంచుతామని ప్రకటించాం
- ఎవరు మంచి చేస్తరు.. ఎవరు చెడు చేస్తరు ఆలోచించాలి
- కాంగ్రెస్ వస్తే కరెంటు పోవుడు ఖాయం
- బీఆర్ఎస్ గెలిస్తే రూ.16 వేల రైతుబంధు
- హాలియా ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్



# రైతు స్థిరంగా ఉండాలి

ఇబ్రహీపట్నం/హాలియా/పాలకుర్తి,నవంబర్14 : రైతులు 10హెచ్‌పీ మోటర్ పెట్టుకుంటడా? ఈ మోటర్ ఎవరు కొనివ్వా లే. తెలంగాణలో 30లక్షల పంపుసెట్లు ఉన్నయ్. 30లక్షల 10హెచ్‌పీ పంపు సెట్లు కొనాలంటే ఎంత డబ్బు కావా లి? ఈ పంపుసెట్లు కొనాలంటే వీని తాత ఇస్తడా? అయ్య ఇస్తడా? ఎక్కడి నుంచి రావాలి' అంటూ సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. ఇబ్రహీపట్నం బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న సీఎం కేసీఆర్.. కాంగ్రెస్ నేతల వ్యవహారశైలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ 'హేరాపేరీ లేకుండా.. ఒకరి భూమిని ఒకరు కాజేయకుండా.. ఎవరికి కోపం వచ్చినా కిందిమీద చేయకుండా ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చాం. ఈ పోర్టల్‌తో రైతులు ఇవాళ నిశ్చింతగా ఉన్నరు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం కాబట్టి.. గవర్నమెంట్ తన వద్ద ఉన్న అధికారాన్ని మీకు అప్పగించింది. మీ భూమిపై యజమాన్యం మీ చేతుల్లో ఉంది. మీ బయోమెట్రిక్ పెడితే తప్ప మీ భూమిని మార్చే అధికారం రాష్ట్రంలో ముఖ్యమంత్రికి కూడా లేదు. ఇవాళ పెరిగిన భూముల ధరలకు.. ఒకవేళ ధరణి లేకపోతే వీఆర్వోలు చేసిన గోల్‌మాల్‌కు ఎన్ని మిగతా 3లో..

## కల్వకుంట్ల ట్రాన్స్‌ఫార్మర్లు

# పేలుతాయ్

- కాంగ్రెస్ రాగానే కెసిఆర్ కుటుంబం కరెంట్ కట్
- భూదోపిడీని అడ్డుకుని బోనులో నిలబెడతాం
- యువత ఉద్యమిస్తే.. కల్వకుంట్ల కుటుంబాల్లో ఉద్యోగాలు
- వెయ్యెకరాల ఫామ్‌హౌజ్‌తో పేదలకు టోపీ
- కెటిఆర్‌కు వందెకరాల్లో జన్వాడ ఫామ్ హౌజ్
- ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యారు
- ఎర్రబెల్లికి ఉన్న అర్హతల్లా కెసిఆర్‌తో చుట్టరికమే
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెల్వకుంటే ప్రజలుకు కష్టాలు తప్పవు
- ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రచారంలో నిప్పులు చెరిగిన రేవంత్ రెడ్డి



వరంగల్,నవంబర్14 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్వకుంట్ల కుటుంబం ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతాయని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. లక్షల కోట్ల అవినీతిని కక్కిస్తామని, భూదోపిడీని బట్టబయలు చేస్తామని అన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన ప్రచారంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ ఫ్యామిలీ కేటీఆర్, హరీష్ రావు, కవిత, సంతోష్ ల కరెంట్ ఊడగొడుతం అన్నారు. మంగళవారం నాడు వర్ధన్నపేట విజయ భేరి సభ నిర్వహించారు. ఈ సభలో రేవంత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ముందు చెప్పులు గతి లేని వ్యక్తులు ఎమ్మెల్యేలు, మంత్రులు అయ్యారు. ల్యాండ్ పూలింగ్‌తో పేదల భూములు లాక్కునే ప్రయత్నం చేశారు. అడ్డుకోబోతే పోలీస్ బూట్లతో తన్నించారు. ల్యాండ్ పూలింగ్ జీవో రద్దు చేయలేదు. ఎన్నికలు వస్తున్నాయని తాత్కాలికంగా పక్కన పెట్టారు. ల్యాండ్ పూలింగ్ జీవో రైతుల మెడ మీద కత్తిలా ఉంది. కాకతీయ యూనివర్సిటీ సాక్షిగా విద్యార్థులు త్యాగం చేస్తే ఇప్పుడు వాళ్లను అణచివేస్తున్నారు. కేసీఆర్ మూడోసారి అవకాశం ఇవ్వాలని అడుగుతున్నాడు. కేసీఆర్ మనవడికి కూడా పదవి కావాలని చూస్తున్నాడు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ లక్ష కోట్లు దిగమింగాడు. తెలంగాణ రైతులను, మీడియాను తీసుకొని మిగతా 3లో..

## బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటే

- బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ఆ పార్టీలు కలిశాయి
- బీజేపీ బలంగా ఉన్న చోట బీజేపీకి కాంగ్రెస్ సపోర్ట్ చేస్తోంది
- బీజేపీ, కాంగ్రెస్‌లు ఢిల్లీలో కొట్టుకుంటాయి
- తెలంగాణలో ఆ పార్టీలు కలిసిపోతాయి
- మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,నవంబర్14 : బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటేనంటూ మంత్రి హరీష్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకే బీజేపీ, కాంగ్రెస్ రెండూ కలిశాయని ఆరోపించారు. బీజేపీ బలంగా ఉన్న చోట ఆ పార్టీకి కాంగ్రెస్ సపోర్ట్ చేస్తోందన్నారు. అలాగే కాంగ్రెస్ బలంగా ఉన్న చోట ఆ పార్టీకి బీజేపీ సపోర్ట్ చేస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఢిల్లీలో కొట్టుకుంటాయి.. తెలంగాణలో కలిసిపోతా యని వ్యాఖ్యానించారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్లు పోయి బీజేపీ గెలిచిందని.. ఆ రెండు పార్టీల మధ్య ఉన్న బం ధానికి ఇదే తార్కాణమన్నారు. తెలంగాణలో కేసీఆర్‌ను ఎదుర్కో లేకే ఆ రెండు పార్టీలూ ఒక్కటయ్యాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన కార్మిక సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీష్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణకు బీజేపీ అన్యాయం చేసినా కాంగ్రెస్ స్పందించడం లేదని ఆరోపించారు.

# 6 నెలలకో సీఎం మారడం పక్కా

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి మాట దేవుడెరుగు!
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పదవుల పంచాయతీయే
- తెలంగాణ ఫెడరేషన్ సమావేశంలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్,నవంబర్14 : తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పదవుల పంచాయతీలు అవుతాయని.. అభివృద్ధి జరగాల్సిన రాష్ట్రంలో గొడవలు కాదు ఏబుల్ లీడర్‌షిప్ అవసరమని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో తెలంగాణ ఫెడరేషన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్నారు. పెట్టుబడులు వస్తేనే నగరంలో సంపద పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని తెలిపారు. 'ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం. కొత్త రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాం. తాగు, సాగునీరు, విద్యుత్ సమస్యలు పరిష్కరించుకున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య సరికొత్త హైదరాబాద్ తయారవుతుంది. హైదరాబాద్‌కు రాకపోకలు చాలా సులువుగా జరగాలి' అని కేటీఆర్ అన్నారు. "ఆరేళ్ల మేము నికరంగా పని చేస్తే మాకన్నా ముందు 65 ఏళ్లు కాంగ్రెస్ వాళ్లు పాలించారు. మేము పని చేసినట్టు వాళ్లు పని చేసి ఉంటే ఈరోజు రాష్ట్రంలో ఇన్ని సమస్యలు ఉండేవా..? కాంగ్రెస్ పార్టీ వాళ్లు మూసీని సుందరీకరిస్తామని చెప్తున్నారు. మూసీని నాశనం చేసింది ఎవరు? 65 ఏళ్లలో 55 ఏళ్లు పాలించింది వారే కదా. 55 ఏళ్లు నాశనం చేసిన వారు వచ్చి.. ఇప్పుడు ఆరున్నర ఏళ్లు పాలించిన వాడిని పట్టుకుని నేను నీకు చందమామను అప్పజెప్పిపోయాను.. నువ్వు దాన్ని మొత్తం నాశనం చేశావు, మసిపూశావు అంటే ఎలా న్యాయం అవుతుందని అన్నారు. త్వరలో ప్రతి ఇంటికీ ప్రతిరోజు తాగునీరు ఇచ్చేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో 24 గంటలు తాగునీరు ప్రతి ఇంటికి వచ్చేలా చేస్తామన్నారు. రెండు సంవత్సరాలు కరోనా ఉన్నా.. తెలంగాణలో మాత్రం ఐటీ రంగంలో విశేష వృద్ధి సాధించామని పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగాల కల్పనలో రెండేళ్లుగా బెంగళూరును అధిగమించామని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి.. ప్రగతి ఇలానే కొనసాగలని మంత్రి కేటీఆర్ కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే



ప్రతి 6 నెలలకు ఒక సీఎం మారడం పక్కా అని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. వారు అధికారంలోకి వస్తే కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలు అమలవుతాయో లేదో కానీ.. సీఎంలు పక్కా అని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి స్టేబుల్ గవర్నమెంట్.. ఏబుల్ లీడర్‌షిప్ అవసరమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే నిత్యం పదవుల కోసం కొట్లాటలు జరుగుతాయని విమర్శించారు. రాష్ట్రంలో సంపద సృష్టిస్తేనే పేద ప్రజలకు సహాయం చేయగలమని అన్నారు. అది చేయాలంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుండాలని తెలిపారు.

## ప్రజానాడి



## బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలది భూకబ్జాలు, అవినీతి లొల్లి

### బీజేపీ ఎంపీ బండి సంజయ్



కరీంనగర్,నవంబర్14 : బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలది భూకబ్జాలు, అవినీతి లొల్లి అని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఇసుక కుప్పలు కన్పిస్తే బీఆర్ఎస్ నేతలు డబ్బులు వసూలు చేస్తున్నారని... ఖాళీ జాగాలు కన్పిస్తే కబ్జాలు చేస్తున్నారన్నారు. యువతను మంత్రి గంగుల కమలాకర్ గంజాయి మత్తులో ముంచుతున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలు గల్లీలో తిరుగుతుంటే జనమే నిలదీస్తున్నారన్నారు. ఓట్ల కోసం ఓటుకు రూ.10 వేలు పంచేందుకు సిద్ధమయ్యాడని బండి సంజయ్ పేర్కొన్నారు. లక్ష సెల్ ఫోన్లు పంచేందుకు గంగుల కమలాకర్ సిద్ధమయ్యాడని పేర్కొన్నారు. గంగుల ఓటమి ఖాయమని కేసీఆర్‌కు ఎప్పుడో తెలుసన్నారు. అందుకే ఒవైసీ వద్ద మోకరిల్లి పచ్చజెండా పట్టుకున్నాడన్నారు. భూకబ్జాలు తప్ప కాంగ్రెస్ చేసిందేమిటని బండి సంజయ్ ప్రశ్నించారు. మందికి పుట్టిన పిల్లలను తమ పిల్లలుగా చెప్పుకునే రకం గంగుల అని విమర్శించారు. గంగుల కమలాకర్ మళ్లీ గెలిస్తే జీతాలు, ఫించన్లు రావన్నారు. మా అత్త చనిపోయిందని ఇంటికొస్తే కేసీఆర్, గంగుల కుట్ర చేసి తనను జైలుకు పంపారని బండి సంజయ్ తెలిపారు.

## అజాతశత్రువుగా ప్రగతికాముక సమాజానికై కృషిచేసిన సాహితీవేత్త నిజాం వెంకటేశం

పద్మారావు నగర్ నవంబర్ 15 (ప్రజా మంటలు) : తన జీవితాంతం సమాజాభివృద్ధికవరకు, పేదల అభ్యున్నతికొరకు, సమసమాజానికై సాహిత్యాన్ని సృష్టించాలనే తపనతో దాదాపు ఐదు దశాబ్దాల పాటు కృషిచేసిన మహనీయుడు నిజాం వెంకటేశం అని సాహితి వేత్తలు కొనియాడారు. నిజాం వెంకటేశం జన్మాదినం రోజున ఆయన పేర కుటుంబ సభ్యులు నెలకొల్పిన నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారాల అందజేత సందర్భంగా ఏర్పాటు చేసిన సభ సామాజిక తత్వవేత్త బి ఎస్ రాములు అధ్యక్షతన జరిగినది. నిజాం వెంకటేశం సహచరుడు, ఆత్మీయుడు కరెంట్ గంగారెడ్డి మాట్లాడుతూ, పుట్టింది సిరిసిల్ళలో అయినా, జగిత్యాల ప్రాంతంలో ఉద్యోగం చేస్తూ, కరీంనగర్ జిల్లా సాహిత్యాన్ని దేశానికి పరిచయం చేయడానికి, ఉత్తర తెలంగాణ రచయితలను, కవులను ఇతర ప్రాంతాల వారికి పరిచయం చేయడానికి కరీంనగర్ బుక్ ట్రస్ట్ ను ప్రారంభించి ఎన్నో



పుస్తకాలూప్రచురణకు తోడ్పడ్డారని చెప్పారు. అవోపా బాధ్యదూ శంకర్ మాట్లాడుతూ, రోజుకు 20 గంటల పాటు సమాజం పట్ల చిత్తశుద్దీతో ఆలోచించే గొప్ప ప్రగతి కాముకుడు నిజాం వెంకటేశం సాహిత్యాన్ని, సమాజాన్ని రెండుకళ్ళలా చూసుకొన్నారని, ఆయనకు కుటుంబం కంటే సమాజయం అంటేనే ఎక్కువ మక్కువని చెప్పారు. తెలుగు సాహిత్యంలో కవులకు, రచయితలకు, విమర్శకులకు ప్రోత్సాహం కలిగించేలా, తన జీవితంలో అధిక భాగం కృషి చేసిన నిజాం మిగతా 2లో..

# మరోమారు తెలంగాణ ప్రచారానికి మోడీ

## మూడ్రోజుల పాటు ప్రచారం చేయనున్న ప్రధాని



హైదరాబాద్,నవంబర్14 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోమారు తెలంగాణ ఎన్నికల ప్రచారం కోసం రానున్నారు. మూడు రోజులు తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతున్నారు. ఈ నెల 24, 25, 27 తేదీల్లో రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో పర్యటిస్తారని భాజపా వర్గాలు తెలిపాయి. ఈనెల 24న నిర్మల్.. 25న ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎన్నికల బహిరంగసభలలో ప్రధాని పాల్గొంటారని వివరించారు. చివరగా 27వ తేదీన కరీంనగర్ బహిరంగసభలో పాల్గొన్న అనంతరం హైదరాబాద్‌లో రోడ్‌షోతో మోదీ తన ఎన్నికల ప్రచారాన్ని ముగించనున్నారని భాజపా నేతలు తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మూడు రోజులు, భాజపా జాతీయాధ్యక్షుడు జె.పి.నడ్డా 5 రోజులు, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ మూడు రోజులు రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 17వ తేదీన భాజపా అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్‌లో భాజపా మ్యానిఫెస్టోను విడుదల చేయనున్నారని తెలిసింది. దీన్ని పార్టీ అధ్యక్షుడు లేదా కేంద్రంలోని కీలక మంత్రి విడుదల చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలోనే అమిత్‌షా మ్యానిఫెస్టోను విడుదల చేస్తారని పార్టీ నేతలు పేర్కొన్నారు. మరోవైపు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్‌లు రోజుకు రెండు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున ఈనెల 19 వరకు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

# జనగామలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

## దోపిడీ బిఆర్ఎస్‌కు పాతర తప్పదు

## కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాపరెడ్డి



జనగామ,నవంబర్14 : జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమైపోయిందని కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ముత్తిరెడ్డి దోపిడీని గుర్తించి ఓడించాలనుకున్న తరుణంలో పల్లాను పార్టీ రంగంలోకి దింపిందని అన్నారు. ఇదికూడా ప్రజలు గమనించారని అన్నారు. తాను ఎక్కడికి వెళ్లినా ప్రజల్లో అనూహ్యస్పందన వస్తోందని, ఈసారి కాంగ్రెస్‌ను గెలపించి బిఆర్ఎస్‌కు బుద్ది చెప్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారని అన్నారు. కాంగ్రెస్ సభలకు వేలాదిగా తరలివచ్చి ఆశీర్వదించడమే నిదర్శమని అన్నారు. మరొక్కసారి దొరల గడీలను బద్దలు కొట్టడానికి వచ్చినట్లుగా అనిపిస్తోందన్నారు. బిఆర్ఎస్ గెలిస్తే దొరల తెలంగాణ బలపడుతుందని ప్రజలు ఏది కావాలో తేల్చుకోవాలని సూచించారు. జనగామ భవిష్యత్తు, అభివృద్ధి ఇక్కడి ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. ముత్తిరెడ్డి తొమ్మిదేళ్ల నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. తొమ్మిదేళ్లుగా పూర్తిగా దోపిడీకి గురిచేశారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఎన్ని అవాంతరాలు వచ్చినా సరే ప్రజల మధ్యలో ఉంటూ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. టీపీసీసీ చీఫ్ వంత్ రెడ్డి నాయకత్వంలో జనగామను మరింత అభివృద్ధి చేసుకునేందుకు తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ గెలుపు కోసం ప్రజల ఎదురుచూపు

## నిరంకుశ ప్రభుత్వానికి పాతరేసేందుకు ప్రజలు సిద్ధం

## హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్



సిద్దిపేట,నవంబర్14 : రాష్ట్రంలో వచ్చేది ఇందిరమ్మ రాజ్యమని, గడీల రాజ్యానికి ప్రజలు చరమగీతం పాడబోతున్నారని మాజీ ఎంపి, హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహిళలు తలచుకుంటే చేయనిదేమీ లేదని, ఈ ఎన్నికల్లో వారే కీలకంగా మారుతున్నారని అన్నారు. తాను ఇక్కడ పోటీ చేస్తుండడంతో గల్లీగల్లీలో ఆడబిడ్డలు కాంగ్రెస్ జెండాలు పట్టుకుని మద్దతు పలకడం చూశానన్నారు. ఇక్కడి సమస్యలు తీరాలంటే అధికారంలోకి కాంగ్రెస్ రావాలన్నారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు ఇవ్వరట అని చెబుతున్న కేసీఆర్ మతి ఉండి చెబుతున్నాడో, మందు వేసి చెబుతున్నాడో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల్లో రైతులకు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేలు, రైతు కూలీలకు రూ.10వేలు ఇస్తామని చెప్పామని తెలిపారు. తమ హయాంలో రేషన్ షాపుల ద్వారా 9 రకాల వస్తువులను 156 రూపాయలకే ఇచ్చామని, ఇప్పుడు ఇస్తున్న దొడ్డు బియ్యం దళారుల పాలవుతున్నాయని, సన్న బియ్యం కావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం రావాలన్నారు. మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.2500, రూ.500కే వంట గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఒక్కనెల ఆగితే చేయూత కింద నెలకు రూ.4వేల పింఛన్ ఇస్తామని, వచ్చేది ఇందిరమ్మ రాజ్యమని, డిసెంబర్ 9న సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే సమక్షంలో తమ ప్రభుత్వం తొలి సంతకం చేయూత పథకం పైలుపైనేనని అన్నారు. మార్పు రావాలి.. కాంగ్రెస్ గెలవాలి.. అని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని పొన్నం అన్నారు.

# బీఆర్ఎస్ పార్టీని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే గెలిపిస్తాయి

హైదరాబాద్,నవంబర్14 : బీఆర్ఎస్ పార్టీని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే గెలిపిస్తాయని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం బేగంపేటలోని దేవిడి, తబేలా, వికార్ నగర్, భగవంతపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన 50 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగాయన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేశారని పేర్కొన్నారు. ఇన్నేండ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని గాలికి వదిలేసిందని మండిపడ్డారు. ప్రజలు ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలని కోరుకుంటున్నారు. ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ నాయకత్వంలో ఃఖీూ ప్రభుత్వం ఏర్పాటవుతుందని స్పష్టం చేశారు.

# అజాతశత్రువుగా ప్రగతికాముక సమాజానికై కృషిచేసిన సాహితీవేత్త నిజాం వెంకటేశం

(మొదటిపేజీ తరువాయి)

వెంకటేశం జ్ఞాపకాలను గుర్తుచేసుకొంటూ, ఆయన ఆశయాలను కొనసాగించాలని, తెలుగులో మంచి సాహిత్యాన్ని ప్రోత్సహించాలనే ఆశయంతోనే ఆయన పేర ప్రతి సంవత్సరం పురస్కారం అందిస్తామని, ఆయన కుమారుడు నిజాం ప్రశాంత తెలిపారు. మొదటిసారి నిజాం వెంకటేశం పేర ఇస్తున్న పురస్కారాలు కవులకు, రచయితలకు, విమర్శకులకు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకొన్న కమిటీ, ఈ సారి విమర్శ గ్రంథాలకు అవార్డులు ఇస్తున్నట్లు, కమిటీ సభ్యులు అదెపు లక్ష్మీపతి పేర్కొన్నారు. మొదటి సారి ఈ పురస్కారాలను డా. వి. త్రివేణి, డా. ఎం. దేవేంద్ర, గోపాగాని దేవేంద్ర, గజ్జెల రామకృష్ణ, శిరపీ చంద్రశేఖర్ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు, కవులు వాడ్రేవు చినవీరబద్రుడు, డా. నాగసూరి వేణుగోపాల్, జూకంటి జగన్నాథం, డా. సూర్యప్రకాశ్, నవచ్చేతన పబ్లికేషన్ బాధ్యులు చంద్రమోహన్, పవన్ కుమార్, బీబీ నర్సన్, ఆయన మిత్రులు దాసరి నాగభూషణం, కాసారపు సంజీవ, సిహెచ్ వి ప్రభాకర్ రావు, సామ్రాట్ అశోక్, తులసి సంపత్, బొద్దుల జనార్ధన్, ఆయన కుటుంబ సభ్యులు, పలువూరు సాహితి వేత్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో వెలమ సామాజిక వర్గానిదే ఆధిపత్యం

## గంగుల గెలుపుతో మారిన సమీకరణాలు

## అత్యధికంగా మున్నూరు కాపు ఓట్లు



కరీంనగర్,నవంబర్14 : కరీంనగర్ నియోజకవర్గ రాజకీయ చరిత్రలో ఎక్కువసార్లు గెలిచింది వెలమ సామాజిక వర్గం నేతలే కావడం గమనార్హం. 1957, 1967, 1972 సాధారణ ఎన్నికల్లో జువ్వాడి చొక్కారావు ఎమ్మెల్యేగా గెలవగా, 1962లో అలిగిరెడ్డి కిషన్ రెడ్డి గెలిచారు. 1983లో బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన కటకం మృత్యుంజయం, ఆ తర్వాత 1985లో వెలమ సామాజిక వర్గానికి చెందిన చల్మెడ ఆనందరావు, 1989లో వెలిచాల జగపతిరావు, 1994లో జువ్వాడి చంద్రశేఖర్ రావు, 1999లో కటారి దేవేందర్ రావు, 2004లో ఎం.సత్యనారాయణరావు(ఎమ్మెస్సార్) విజయం సాధించారు. 2009లో గంగుల కమలాకర్ గెలిచేంత వరకు ఇక్కడ నుంచి 1978లో ఒక్కసారి మాత్రమే నలమాచు కొండయ్య అనే బీసీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009 నుంచి వరుసగా గంగుల కమలాకర్ మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించారు. దీంతో ఇప్పుడు ఆ కులం ఓట్లు ఎవరిని ముంచుతాయి.. ఎవరిని తేలుస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. కరీంనగర్ నియోజకవర్గంలో 3.40 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా, ఇందులో అభ్యర్థి గెలుపోట ములను నిర్ణయించే స్థాయిలో మున్నూరు కాపు, ముస్లిం ఓటర్లు ఉన్నారు. కరీంనగర్‌లో కాపువాడ పేరుతో ఓ పెద్ద కాలనీనే ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మున్నూరు కాపుల ప్రాబల్యం చాలా ఎక్కువ. కరీంనగర్ సిటీలోని కార్ఖానాగడ్డ, ఫతేపుర, ముక్రంపుర, కశ్మీర్ గడ్డ, గోదాం గడ్డ, రోజ్ టాకీస్ ఏరియా, రేకుర్తి, కొత్తపల్లి మున్సిపాలిటీలో ముస్లిం పాపులేషన్ ఎక్కువగానే ఉంటుంది. ఈ రెండు సామాజిక వర్గాల ఓట్లే సుమారు లక్షకుపైగా ఉంటాయని అంచనా. 2014 తర్వాత కరీంనగర్‌లో కొత్తగా వేసిన రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్ పాత్‌లు, పార్కులు, కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, ఐటీ టవర్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఈద్గాకు 8 ఎకరాల స్థలం మంజూరు, త్వరలో నిర్మాణం చేపట్టనున్న టీటీడీ టెంపుల్, ఇస్కాన్ టెంపుల్‌ను ప్రచార అస్త్రాలుగా మంత్రి గంగుల కమలాకర్ వాడుతున్నారు. అలాగే, బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పేర్కొన్న స్కీమ్‌లతో ప్రజల్లోకి వెళ్తున్నారు. బండి సంజయ్ ఎంపీ అయ్యాక కరీంనగర్ ప్రజలకు కనిపించకుండా పోయారని, ఎంపీ అయ్యాక కరీంనగర్‌కు చేసింది ఏం లేదని విమర్శిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌పై ఉన్న భూకబ్జా కేసులు, రౌడీ షీట్‌ను ప్రచారానికి పెడుతున్నారు. బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్ మాత్రం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను చర్చకు పెడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, గ్రూప్ 1 పేపర్ లీకేజీ, ఉద్యోగాల భర్తీలో వైఫల్యం, సివిల్ సప్లై శాఖ మంత్రిగా గంగుల కమలాకర్ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపణలు చేస్తున్నారు. అలాగే, కేంద్రం ఇచ్చిన స్మార్ట్ సిటీ ఫండ్స్‌తోనే కరీంనగర్ డెవలప్ అయిందని, కరీంనగర్ – వరంగల్ ఫోర్ లేన్ హైవేను ప్రచారం చేసుకుంటున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ బీఆర్ఎస్ వ్యతిరేక ఓటు బ్యాంకుపైనే ఆశలు పెట్టుకున్నారు. అలాగే, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రచారం చేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. తనపై ఉన్న క్రిమినల్ కేసులే ఆయనకు మైనస్‌గా మారాయి.

# కెసిఆర్ నిరంకుశ పాలనకు చెల్లుచీటి

- ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించడానికి సిద్ధం
- ఖమ్మం జిల్లా అభివృద్ధికి శాయశక్తుల కృషి
- కాంగ్రెస్ నేత తుమ్మల నాగేశ్వర రావు



ఖమ్మం,నవంబర్14 : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఇక కెసిఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని కాంగ్రెస్ అభ్యర్థి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కుటుంబ పాలనతో పాటు, నిరంకుశ పాలనకు ప్రజలు బుద్ధి చెప్ప బోతున్నారని అన్నారు. తాను గతంలో రైతులకు, వ్యాపారులుకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు వసతులు కల్పించానన్నారు. అరాచక శక్తులు లైసెన్స్‌ల కోసం లక్షల్లో దోచుకున్నారనీ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఖమ్మంలో శాశ్వత పనులు భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆశీస్సులతో చేసే భాగ్యం తనకు దక్కిందన్నారు. కాంగ్రెస్ పాలనలో ఇక ప్రజలు మీరు కోరుకున్న మిగతా పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. నిరంకుశ పాలకులను తరమి కొట్టాలని, మీ భవిష్యత్ కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపిచ్చారు. ఈ నెల 30న జరిగే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆధునిక ఖమ్మం రూపశిల్పిగా ఖమ్మం ప్రజానీకం ఆకాంక్షల కోసం పనిచేస్తానని అన్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలని... సోనియా గాంధీ రుణం తీర్చుకుకుందామని పిలుపిచ్చారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలు తెలంగాణకు మంచి భవిష్యత్ అని, నిరంకుశ అవి నీతి, అప్రజా స్వామికపాలనకు వ్యతి రేకంగా ఖమ్మంతో పాటు యావత్ తెలంగాణ ప్రజానీకం చారిత్రక తీర్పు ఇవ్వాలని తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ తొలిదశ మలిదశ ఉద్యమ కారులు తనకు సంఘీభావంగా నిలవడం మీ ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనమన్నారు. భగవంతుడు ఇచ్చిన శక్తి మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించానని, గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా శస్య శ్యామలం చేయడం కోసమే నాడు టీఆర్ఎస్ లో చేరానని, మోసకారి నాటకాల స్వార్ధ పూరిత కేసీఆర్ ప్రభుత్వ వైఖరి నచ్చకే కాంగ్రెస్‌లో చేరానన్నారు. ఉద్యమ కారులకు ఇంటి స్థలాల వాగ్దానం ఆరు గ్యారంటీ పథకాల్లో ఉందన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం ఉద్యమ కారులు కథం తొక్కడం సంతోషమని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.

# వందల మంది బలిదానాలు చేస్తే ఒక్క కుటుంబం మాత్రమే సుఖపడుతుంది : పొంగులేటి



ఖమ్మం,నవంబర్14 : తిరుమలాయపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భాగంగా పొంగులేటి మాట్లాడుతూ ఎంతో మంది కవులు, కళాకారులు, ఉద్యమకారులు, విద్యార్థులు బలిదానం ఫలితంగా వచ్చిన తెలంగాణ రాష్ట్రం కేవలం ఒకే ఒక్క కుటుంబం స్వార్ధం కోసం వాడుకుంటోందని పేర్కొన్నారు. 2014కు ముందు కేసీఆర్ ఆర్థిక పరిస్థితి ఏంటి?.. గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాల్లో ఆర్థిక పరిస్థితి ఏంటనేది ప్రజలు ఆలోచించాలని పొంగులేటి పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఇంద్రలోకాన్ని చూపిస్తూ తెలంగాణ యాసలో ప్రజలను మభ్య పెడుతుంటాడన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను కాదని రెండు సార్లు కేసీఆర్‌కు అధికారం అప్పగిస్తే ధనిక రాష్ట్రంగా ఉన్న రాష్ట్రాన్ని ఐదున్నర లక్షల కోట్ల అప్పుల పాలు చేశాడన్నారు. కాళేశ్వరం పేరుతో ఐదున్నర లక్షల కోట్లలో ప్రజల సొమ్ము కేసీఆర్ దొంగిలించాడని పొంగులేటి తెలిపారు. అలాంటి కేసీఆర్ ను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామా? అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వస్తేనే మన కష్టాలు తీరుతాయని పొంగులేటి తెలిపారు.

# తెలంగాణ ఆర్థిక ఛోదక శక్తి హైదరాబాద్

## హైదరాబాద్ సహా రాష్ట్రమంతా భూముల రేట్లు అధికం

## దేశానికే తెలంగాణ ఒక దిక్సూచి అని : కేటీఆర్



హైదరాబాద్,నవంబర్14 : తెలంగాణ ఆర్థిక ఛోద క శక్తి హైదరాబాద్ అని మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్ర జీడీపీలో 45 నుంచి 50 శాతం ఇక్కడి నుంచే వస్తున్నదని చెప్పారు. హైదరాబాద్‌ను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం కుంటుపడుతుందన్నారు. హైదరాబాద్ తాజ్ దక్కన్‌లో జరిగిన తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ సమావేశానికి మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే భూముల రేట్లు పడిపోతాయని ఆనాడు ప్రచారం చేశారు.. కానీ హైదరాబాద్‌లో రేట్లు 10 నుంచి 20 రెట్లు పెరిగాయన్నారు. హైదరాబాద్ సహా రాష్ట్రమంతా భూముల రేట్లు అధికమయ్యాయని చెప్పారు. మాజీ సీఎం చంద్రబాబు కూడా ఇదే విషయం చెప్పారని గుర్తుచేశారు. 2014కు ముందు వ్యవసాయానికి ఆధారం లేదని, పెట్టుబడి, నీళ్లు, కరెంటు ఉండేది కాదన్నారు. నాడు రైతులు ఆస్తులు అమ్ముకున్నా అప్పులు కట్టలేని దుస్థితి ఉండేదని, నేడు వారికి భూములే భరోసా అన్నారు. భూముల విలువ పెరగడంతో రాష్ట్రంలోని వ్యక్తుల్లో ధీమా వచ్చిందని చెప్పారు. దేశానికే తెలంగాణ ఒక దిక్సూచి అని కేటీఆర్ అన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రం బాగుపడిందని, అసాధారణ విజయం సాధించామని చెప్పారు. గత పాలకులు తమకేమీ అద్భుత దీపం ఇచ్చిపోలేదని, సుస్థిర ప్రభుత్వం, సమర్ధ నాయకత్వం వల్లే అభివృద్ధి సాధ్యమైందని చెప్పారు. కరోనా వల్ల రెండేండ్లు వృథా అయిందని, సరిగ్గా ఆరున్నరేండ్లు మాత్రమే పనిచేయగలిగామని వెల్లడించారు. అమెరికాలో కూడా సమస్యలు ఉన్నాయని చెప్పారు. ప్రాధాన్యక్రమంలో సమస్యలు పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత 65 ఏండ్ల పాలకులు ఏం చేశారు.. ఈ ఆరున్నరేండ్లలో తాము ఏం చేశామో చూడాలన్నారు. గత పాలకులు సరిగ్గా పనిచేస్తే నేడు ఇన్ని సమస్యలు ఉండేవా అని ప్రశ్నించారు. ఆనాడు కరెంటు ఉంటే వార్త.. కానీ ఇప్పుడు కరెంటు పోతే వార్త అని స్పష్టం చేశారు. పదేండ్ల కిందట పరిస్థితి ఎలా ఉండేదో ప్రజలు గుర్తుచేసుకోవాలన్నారు. రెండు సార్లు అవకాశం ఇచ్చాంకదా అని కొందలు అంటున్నారని, బాగా పనిచేసినప్పుడు మార్చాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. 11 సార్లు అవకాశం ఇస్తే కాంగ్రెస్ చేసిందేంటన్నారు. కష్టపడి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కసాయి చేతుల్లో పెడదామా అన్నారు. కర్ణాటక పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందన్నారు. 40 శాతం కమిషన్ అని అక్కడి బీజేపీ ప్రభుత్వాన్ని పంపారని, ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ వాళ్లు చదరపు అడుగుకు రూ.500 వరకు బిల్డర్స్ నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్ గొప్పదనం, తెలంగాణ గొప్పతనం ఇక్కడున్న వారికి అర్థం కాదన్నారు. తెలంగాణలో మౌలిక సదుపాయాలను చూసి మహారాష్ట్ర బిల్డర్స్ ఆశ్చర్యపోతున్నారని చెప్పారు. తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. పెట్టుబడుల వల్ల అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని వెల్లడించారు. ధాన్యం ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉన్నామని చెప్పారు. ఐటీ రంగం వృద్ధి 2022–23లో రూ.57 వేల కోట్లని, ఈ ఏడాది దేశంలో వచ్చిన ఐటీ ఉద్యోగాల్లో 44 శాతం తెలంగాణ వారేన్నారు. ఐటీ రంగంలో తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందని చెప్పారు. ఉద్యోగ కల్పన, టెక్నాలజీ రంగంలో బెంగళూరును హైదరాబాద్ దాటిపోయిందన్నారు. అభివృద్ధి, ప్రగతి కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని చెప్పారు. స్థిరమైన ప్రభుత్వం, దృఢమైన నాయకత్వం లేకపోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందన్నారు. ఇవాళ తెలంగాణకు ఓ బ్రాండ్ ఇమేజ్ ఉందని చెప్పారు. ప్రపంచంలోనే తెలంగాణ అంటే ప్రోగ్రెసివ్ స్టేట్ అని తెలిపారు. అభివృద్ధే తమ కులం అని, సంక్షేమమే మతం అనే పద్ధతిలో ముందుకుపోతున్నామని చెప్పారు. అందుకే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని, సంపద సృష్టించబడుతున్నదని స్పష్టం చేశారు. నాడు ఆర్థిక అసమానతలు, సామాజిక రుగ్మతల వల్లే నక్సలిజం వచ్చిందని చెప్పారు. తెలంగాణలో నేడు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు మనకు ముగ్గురు ముఖ్యమంత్రులు మాత్రమే మనకు గుర్తొస్తారని చెప్పారు. ప్రో బిజినెస్, ప్రో అర్బన్ అనేవి చంద్రబాబు మోడల్ అని.. ప్రో రూరల్, ప్రో అగ్రికల్చర్, ప్రో పూర్ అనేవి రాజశేఖర్ రెడ్డి విధానమని, అన్ని రంగాల అభివృద్ధే సీఎం కేసీఆర్ మోడల్ అని మంత్రి కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్‌లో ప్రతిఒక్కరు ముఖ్యమంత్రి అభ్యర్థేనని ఎద్దేవా చేశారు. నామినేషన్ రిజెక్ట్ అయిన జానారెడ్డి కూడా సీఎం అభ్యర్థేనని విమర్శించారు. ఆ పార్టీలో 11 మంది సీఎం కాండెట్లు ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిని దించడానికి ఆ పార్టీ నేతలే మతకలహాలు పెట్టారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఏమోకానీ.. ఆరు నెలలకో సీఎం గ్యారెంటీ అని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 3 తర్వాత సింగిల్ విండో అమలుచేస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలు ఏమైనా ఉన్నా సవరిస్తామని చెప్పారు.

# బజార్‌ఘాట్ అగ్ని ప్రమాద ఘటనపై పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్,నవంబర్14 : బజార్‌ఘాట్ అగ్ని ప్రమాద ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనాస్థలంలో మరోసారి క్లూస్ టీం.. ఫోరెన్సిక్ టీం.. ఎంటరై ఆధారాలు సేకరిస్తున్నాయి. రోడ్డుపై ఆయిల్ పారుతూ ఉండడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది మట్టి పోసింది. బిల్డింగ్‌లోని మిగిలిన ఆయిల్ డ్రమ్ములను జీహెచ్ఎంసీబయటకి తరలించింది. మరోవైపు బిల్డింగ్ పట్టిష్టతను జేఎన్‌టీయూ బృందం పరిశీలించనుంది. అగ్నిప్రమాదం జరిగిన అపార్ట్‌మెంటుకు దగ్గరలో రమేష్ జైస్వాల్ షాప్ ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. షాప్‌లో రికార్డులను తనిఖీ చేయడంతోపాటు కార్యకలాపాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ఆ రెండు పార్టీలకు వారి కుటుంబాల మేలే ముఖ్యం

## ప్రజల కష్టాల పట్టవు : బీజేపీ ఎంపీ లక్ష్మణ్



హైదరాబాద్,నవంబర్14 : బీఆర్ఎస్ అంటే కేసీఆర్ ఫ్యామిలీ వికాస్ అని.. కాంగ్రెస్ అంటే గాంధీ ఫ్యామిలీ వికాస్ అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కుటుంబ ప్రయోజనాల కోసం తప్పితే ఈ రెండు పార్టీలు ప్రజల మంచి కోరదన్నారు. కేసీఆర్‌కు సీఎంగా అవకాశం ఇస్తే అడుక్కునే పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. బై ఎలక్షన్ వస్తే కుర్చీ అక్కడే వేసుకున్న కేసీఆర్ ఆ తర్వాత ముఖం చాటేశారన్నారు. ఇప్పుడు హెలికాప్టర్ వేసుకుని వేట కుక్కల్లాగా ఓట్లు అడుక్కుంటున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేషన్ కార్డులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో బీఆర్ఎస్ సర్కార్ ఉందన్నారు. “అంటే ఆగడు.. పంటే లేవడు” అంటూ ఎద్దేవా చేశారు. 10 ఏండ్లలో చేయని అభివృద్ధి 10 రోజుల్లో చేస్తారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ఫక్తు రాజకీయాలతో తెలంగాణ ఆగమవుతోందన్నారు. కాంగ్రెస్ 70 ఏండ్లు అధికారంలో ఉండి గరీబ్ హఠావో.. ఇందిరమ్మ ఇండ్లు అనినాదాకే పరిమితమైందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై కోడి గుడ్డు మీద ఈకలు పీకినట్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ పరిస్థితి మారిందని వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు పార్టీల డీఎన్ఏ అవినీతి మాత్రమే అని అన్నారు. పూటకో అవినీతికి పాల్పడుతున్నాయని ఎంపీ ఆరోపించారు. సౌభాగ్యలక్ష్మి సంగతి కొత్త పథకం సరే.. గతంలోని నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. బీసీ సీఎం అన్నా.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్తే వీరికి కడుపు మంటగా ఉందన్నారు. వాళ్ళు చేయరు.. చేసేవాళ్లను విమర్శిస్తున్నారని అన్నారు. కుంభకర్ణుడిలా పదేళ్లు నిద్రపోయి.. పగటి వేష గాళ్లలాగా ఓట్లు అడుక్కునేందు కు వస్తున్నారన్నారు. కాపలా కుక్కలాగా ఉంటానన్న కేసీఆర్.. గుంటనక్కలా మారారని విరుచుకుపడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి వంత పాడే పార్టీ మజ్లీస్ అని.. వీరంతా తోడు దొంగలు.. గజ దొంగలన్నారు. తమది పీపుల్స్ మేనిఫెస్టో అని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీజేపీ మేనిఫెస్టో ఉంటుందని తెలిపారు. ఇతర పార్టీల్లాగా అమలుకు సాధ్యం కాని హామీలు తాము పొందుపరచలేదన్నారు. పార్టీ నుంచి ఇతర పార్టీలకు వెళ్ళొద్దని కోరుకుంటున్నానని.. కానీ వారి వ్యక్తిగత అవసరాల కోసం వెళ్తే తాము చేసేదేముందని అన్నారు. బీఆర్ఎస్ మోసం చేయడం వల్ల విజయశాంతి బీజేపీకి వచ్చారని.. మళ్ళీ అక్కడికే వెళ్తారని అనుకోవడం లేదని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

# తెలంగాణలో బిజెపి సైంధవపాత్ర !

కర్నాటకలో బిజెపి వ్యూహం బెడిసింది. అక్కడ ప్రజల ముందు బిజెపి పప్పులు ఉడకలేదు. కాంగ్రెస్ ఏదో వెలగబెడుతుందన్న నమ్మకం లేకపోయినా...ముందు బిజెపిని తరిమేయాలన్న కసితో ప్రజలు ఓటేసారు. ఎందుకంటే విపక్ష నేతలపై దాడులు, కేసులు ఇలా ఎన్నో రకాల వేధింపులు చేశారు. డికె శివకుమార్‌పై కేసులే ఇందుకు నిదర్శనం. రాజకీయ అవినీతిని చెండాడాల్సి వస్తే గట్టి చర్యలు తీసుకోవాలి. నిగ్గదీసి వారిని బోనులో నిలబెట్టాలి. కేవలం వేధింపులు కాకుండా పక్కా చర్యలకు పూనుకుని ఉంటే ప్రజలు హర్షిస్తారు. ఈ దేశంలో రాజకీయ అవినీతి, కార్పోరేట్ అక్రమాలు కలసిపోయి రాజ్యమేలుతున్నాయి. బిజెపి చేస్తున్న లేదా చేయిస్తున్న దాడులు కూడా అలాగే బెదరింపు వ్యవహారాలుగా మారాయి. తాజాగా తెలంగా ణలో కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఐటి దాడులు కూడా ఇదే కోవలోకి వస్తాయి. ఎవరి ప్రోత్సాహం, ప్రోద్బలంతో ఈ దాడులు చేశారన్నది స్వయంగా పొంగులేటే వెల్లడించారు. విషయమేమంటే బిజెపి చేస్తున్న రాజకీయాలు రానురాను ఏవగింపు కలిగించేవిగా ఉన్నాయి. బిజెపిని అధికారంలోకి తీసుకుని వస్తామన్న బిజెపి మాటలు కాస్తా పక్కదారి పట్టాయి. వ్యవహారం చూస్తుంటే బిజెపి వేస్తున్న ప్రతి అడుగూ.. బిఆర్ఎస్ అధికారం జారిపోకుండా, కాంగ్రెస్ గెలవకుండా చేస్తున్న ప్రయత్నాలుగానే ఉన్నాయి. ప్రజలు, రాజకీయ నాయకులు, విశ్లేషకులు చేస్తున్నట్లుగానే ఉన్నాయి. ఇకపోతే ఎన్నికలకు ముందు బండి సంజయ్‌ను మార్చడంపై అందరూ ముక్కున వేలేసుకున్నారు. స్పీడ్‌గా నడుస్తున్న బండిని వదలడంపై వచ్చిన విమర్శలకు నేటికీ బిజెపి నాయకత్వం వద్ద సమాధానం లేదు. పార్టీని గాడిలో పెట్టి పరుగులు తీయిస్తున్న బండి సంజయ్‌ను తొలగించడం అన్నది ఎవరి వ్యూహాలక చిక్కడం లేదు. కానీ మొత్తంగా ఇప్పుడు అర్థమయ్యిందల్లా పరోక్షంగా బిఆర్ఎస్‌ను అధికారంలో కొనసాగించడం లేదా..బిజెపి మద్దతుతో ప్రభుత్వం ఏర్పడేలా ప్లాన్ చేస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే అసలు విషయాన్ని వదిలేసి ఇప్పుడు బిసి సిఎం అంటూ చేస్తున్న ప్రకటనపై ప్రజలు చర్చించకుంటున్నారు. ఇంత దౌర్భాగ్యమా అని అనుకుంటున్నారు. బీసీని ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రకటించినా.. ఎస్సీ వర్గీకరణపై సాక్షాత్తూ ప్రధాని మోదీ నర్మగర్భంగా హామీ ఇచ్చినా ప్రజల్లో పెద్దగా స్పందన రావడం లేదు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం చేస్తున్నా కూడా ప్రజలు పెద్దగా పట్టించుకోవడం లేదు. అయితే ఈ అంశాల ఆధారంగా కొంతమేర కాంగ్రెస్‌కు నష్టం కలుగుతుందని మాత్రం ప్రతి ఒక్కరూ అంచనా వేస్తున్నారు. ఇలా జరగాలని కూడా బిజెపి కోరుకుంటుందా అన్నదే అనుమనం కలుగుతోంది. అయితే పక్కాగా అధికారంలోకి రావాలన్న విషయంలో బీజేపీ నాయకత్వం విఫలమైందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమని, కేసీఆర్ సర్కారును గద్దె దించుతామని చెబుతున్న బీజేపీ నాయకతులు కార్యాచరణలో ఆ తెగువను చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. బీజేపీని గెలిపిస్తే బీసీని ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రకటించే విషయాన్ని జనంలోకి తీసుకెళ్లడంలో బీజేపీ విఫలమైందనే విమర్శలు కూడా వెల్లువెత్తతున్నాయి. 112 ఉపకులాలకు చెందిన బీసీ ఓటర్లున్నారు. రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో బీసీలే ఎక్కువ ఈ సామాజివర్గాన్ని ఆకట్టుకుంటే సీఎం సీటు వస్తుందనేది అందరికీ తెలుసు. బీజేపీ కేంద్ర నాయకత్వం కూడా ఇదే ఉద్దేశంతో బీసీ సీఎం నినాదాన్ని తెరమీదకు తెచ్చినా ఇక్కడ సీరియస్‌గా ఈ విషయంలో బిజెపికి చిత్తశుద్ధి లేదన్నది మాత్రం సుస్పష్టం. ఈ విషయాన్ని గాలికొదిలేశారనే విమర్శలున్నాయి. మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ తెలిసేలా రాష్ట్ర నాయకత్వం ప్రచారం చేయడం లేదనే విమర్శలొస్తున్నాయి. దీనిపై ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపోతే ఎప్పుడూ పెద్దగా ఆసక్తి చూపని బిజెపి

ఎన్నికల ముందు డ్రామాకు తెరతీసింది. ఎస్సీ వర్గీకరణ కోసం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నిర్వహించగా.. ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కావడమే గాకుండా...ఎస్సీ వర్గీకరణకు కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇదంతా కూడా ఎస్సీల్లో ఓ వర్గాన్ని కాంగ్రెస్‌కు దూరం చేసే ఎత్తుగడ గానే ఉంది. ఇంకా లోతుగా పరిశీలిస్తే బిజెపి ఎత్తుగడలన్నీ బిఆర్ఎస్ సూచనల మేరకే జరుగుతున్నాయని అర్థం అవుతోంది. కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి రాకుండా సైంధవపాత్ర పోషిస్తుందని అర్థం అవుతోంది. ఎస్సీల్లో మాదిగ ఉపకులాలకు చెందిన వారే ఎక్కువంగా ఉన్నారు. వర్గీకరణ కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా పోరాటం సాగుతోంది. ఎస్సీ వర్గీకరణకు తాము కట్టుబడి ఉన్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయానికి ముగింపు పలకడానికి త్వరలోనే ఎస్సీ వర్గీకరణపై కమిటీని ఏర్పాటు చేసి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 30 ఏండ్లుగా సాగుతున్న మాదిగల పోరాటంలో తాను తోడుగా ఉంటానని, మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఒక సహాయకుడిగా పనిచేస్తానని ఆయన చెప్పారు. ఇదంతా కూడా ఎన్నికలకు ముందు జరిగిన తతంగమని మరచిపోరాదు.

ఒకదాని వెనక ఒకటిగా బిజెపి అనుసరిస్తున్న వ్యూహాలన్నీ, చేస్తున్న ప్రకటనలన్నీ కేవలం బిఆర్ఎస్ అధికారన్ని పదిలం చేసేవిగా ఉన్నాయి. దశాబ్దాల ఉద్యమం,యువకుల ప్రాణ త్యాగాలతో తెలంగాణ ఏర్పడితే..పదేండ్లు పాలన సాగించిన బీఆర్ఎస్ మాత్రం అన్నివర్గాల ప్రజలను మోసంచేసిందన్న ఆరోపణలున్నాయి. కెసిఆర్ నిరంకుశ విధానాలపై ప్రజలు ఆందోళనలో ఉన్నారు. కెసిఆర్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్న భావన కనినిస్తోంది. తెలంగాణ గౌరవాన్ని, అస్థిత్వాన్ని బీఆర్ఎస్ సర్కారు కాపాడలేకపోయింది. తెలంగాణలో ఓ నిరంకుశ ప్రభుత్వాన్ని పారద్రోలేందుకు ప్రజలు పోరాడుతున్న తరుణంలో బిజెపి సైంధవ పాత్ర పోషించడం ద్వారా చరిత్రలో ఓ మచ్చను మిగల్చబోతోంది.

# గోరా జీవిత సర్వస్వం హేతువా దానికే అంకితం

## నవంబర్ 15...నాస్తిక వాది గోపరాజు జయంతి



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

హేతువాదం అనే తాత్విక విధానాన్ని విశ్వసించి అనుసరించే వారిని హేతువాదులు అంటారు. హేతువు అంటే కారణం అని అర్థం. ఏదైనా ఒక విషయాన్ని గుడ్డిగా విశ్వసించకుండా దానికి కారణాలను అన్వేషించడం లేదా ఆరా తీయడాన్ని హేతువాదం అంటారు. జ్ఞానానికి లేదా ఋజువుకు “హేతువు” లేదా “కారణం” అనేది మాత్రమే నమ్మదగిన ఆధారం అని భావించే తాత్విక ధోరణిని హేతువాదం అంటారు. హేతువాదానికి శాస్త్రీయ దృక్పథం పునాది. మానవుడే కొలమానం, మనిషి అన్నిటికీ మూలం అనే మూల సూత్రాలతో హేతువాదం ఆవిర్భవించింది.గోరా'గా ప్రసిద్ధులైన గోపరాజు రామచంద్రరావు నాస్తికుడిగా, హేతువాదిగా, గాంధేయవాదిగా తెలుగు వారందరికీ సుపరిచితులు. ఆయన దృష్టిలో ఆస్తికత, హేతు వాదం రెండు భిన్న ధ్రువాలు. నేటి సమాజంలో అగ్ర, నిమ్న జాతులనే వర్ణ బేధాలు, అంధ విశ్వాసాలు పెరగటానికి ఆస్తికతే కారణం అని ఆయన గట్టి నమ్మకం. మానవులందరూ ఒకటే అన్న భావం పెరగాలంటే , అది ఒక్క నాస్తికవాదం వల్లనే సాధ్యమని విశ్వసించి, నాస్తికభావాల ప్రచారం కోసం తన జీవితమంతా వెచ్చించారు గోరా. పెళ్ళికి ముందే సెక్స్ పై అవగాహనలు, కుటుంబ నియంత్రణ, వీటితో పాటు అప్పటి తెలుగు సమాజంలో ఎన్నో విప్లవా త్మక మార్పులను తెచ్చిపెట్టిన ఘనత గోరాదే. గోరా ప్రస్తుత ఒరిస్సా రాష్ట్రంలో ఉన్న ఛత్రపూర్ అనే కుగ్రామంలో, 1902, నవంబరు 15 న ఉన్నత కుల హిందూ కుటుంబంలో వెంకట సుబ్బారావు, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించారు. పర్లాకిమిడిలో ప్రాథమిక విద్యాభాసం పూర్తిచేసిన తర్వాత 1913లో పిఠాపురం రాజా కళాశాల ఉన్నత పాఠశాలలో చదివారు. 1920లో పిఠాపురం రాజా అనుబంధ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తిచేసిన గోరా, అప్పుడే ప్రారంభమౌతున్న సహాయ నిరాకరణోద్యమంలో కాలూనారు. 1922లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో వృక్షశాస్త్రంలో బి.ఏ చేశారు. రామచంద్రరావు వృక్ష శాస్త్రంలో డిగ్రీ చదివి, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో అదే శాస్త్రంలో మాస్టర్ డిగ్రీలో ఉత్తీర్ణుడయ్యారు. 1922 లో సరస్వతిని ఆమె 10 ఏళ్ళ ప్రాయంలోనే వివాహం చేసుకున్నారు. మధురలోని మిషన్ కళాశాలలో అధ్యాపకుడిగా చేరాడు.



కోయంబత్తూరు వ్యవసాయ కళాశాలలో ప్రత్తి పరిశోధనా సహాయకుడిగా, తర్వాత కొలంబోలోని ఒక కళా శాలలో జీవశాస్త్ర అధ్యాపకునిగా, 1928లో కాకినాడ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. తాను నడిచే మార్గం తండ్రికి ఇష్టం లేకపోవడంతో 1928 లో భార్య, పిల్లలతో ఇంటిని వదిలేసి వచ్చారు. స్వతంత్ర భావాలుగల గోరా ఎక్కడా ఉద్యోగంలో నిలువలేక పోయారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా లాంటి ఉద్యమాలలో పాల్గొని బ్రిటిష్ ప్రభుత్వపు జైళ్లలో కఠిన శిక్షలు అనుభవించారు. గోరా అనేక రచనలను చేశారు. సంఘం, ఆర్థిక సమత అనే పత్రికలను నడిపారు. వర్ణవ్యవస్థ, అంటరానితనం మీద తన యుద్ధాన్ని ప్రకటించిన గోరా 1940 లోఆయన భార్యతో కలసి నాస్తిక కేంద్రాన్ని, కృష్ణా జిల్లాలోని ఒక గ్రామంలో ప్రారంభించారు. దేశ స్వాతంత్ర్యం సందర్భంగా, 1947 లో, కేంద్రాన్ని విజయవాడకు తరలించారు. 1944లో మహాత్మా గాంధీ కోరిక మేరకు అఖిల భారత కాంగ్రెస్ ఆర్గనైజర్‌గా అలహాబాద్, ఢిల్లీలలో పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుని గానేకాక, సాంఘిక, ఆర్థిక సమానత్వ సాధనకు, మూఢ నమ్మకాల నిర్మూలనకు, ప్రజల్లో శాస్త్రీయ దృష్టిని పెంపొందించ డానికి, వయోజన విద్యా వ్యాప్తికి, కుల, మత తత్వాల నిర్మూలనకు అనితర కృషి గోరా సల్పారు. గాంధీతో నాస్తికత్వంపై చర్చలు జరిపి, అస్పృశ్యతా నిర్మూలన కోసం కృషి చేసారు. దళితుల దేవాలయ ప్రవేశాన్ని, సమష్టి భోజనాలను, వివాహాలను విస్తృతంగా ఆయన నిర్వహించారు.ఆయనకు తొమ్మిది మంది సంతానం. సంతానానికి ఆయన సందిర్భోచితంగా పేర్లు పెట్టారు. ఉప్పు సత్యాగ్రహం కాలంలో పుట్టినందున లవణం, భారతీయులు చట్టసభలలో నిలిచి గెలిచిన కాలంలో పుట్టినందున విజయం, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో పుట్టినందున ఒక కుమారునికి సమరం, మరొక కుమారునికి నియంత. తొమ్మిదవ సంతానానికి నౌవ్ గా పేర్లు పెట్టారు. హిందీ భాషలో నౌవ్ అంటే తొమ్మిది అని అర్థం. కుమార్తెలు మనోరమ, మైత్రి, విద్య. గోరా 25 ఏళ్ళ వయసు వరకు ఆస్తికుడే. తరువాత నాస్తిక సిద్ధాంతాలతో జీవితాంతం కృషి సల్పిన గోరా జీవితమే ఒక ఆదర్శం. ఆయన తన భార్యకి గర్భం వచ్చిన ప్రతిసారీ గ్రహణ సమయంలో గర్భవతిగా ఉన్న ఆమెను బయటకి తీసుకొని వెళ్లి తిప్పేవారు. గ్రహణం సమయంలో గర్భిణులు బయట తిరిగినంత మాత్రాన పుట్టబోయే పిల్లలకు గ్రహణం మొర్రి రాదు, అని నిరూపించటానికి. గోరా తన సంతానం అందరికీ, వారివారి అభీష్టం మేరకు, వర్ణాంతర వివాహాలు 'నాస్తిక పద్ధతిలో' జరిపించారు. ప్రముఖ కవి, దళిత కులానికి చెందిన గుర్రం జాషువా కూతురైన హేమలతను, తన కుమారుడైన లవణంకు వివాహం జరిపించిన ఆదర్శవాది గోరా. చెప్పింది చేసి చూపించిన మహనీయుడు ఆయన. 1970 లో బోస్టన్ లోనూ,1974లో హాలండ్ లోని అంష్టర్డాంలో జరిగిన అంతర్జాతీయ హ్యూమనిష్టు మహాసభలలో గోరా పాల్గొన్నారు. తెలుగులో ఒక వార పత్రిక 'సంఘం' ను స్థాపించి, దాని ద్వారా తన ఆశయాలను, లక్ష్యాలను ప్రజలలో విశేషంగా ప్రచారం చేశారు. గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది, నాస్తిక ఉద్యమ నాయకుడు, హేతువాది అయిన గోరా, 26 -07 -1975 న విజయవాడ లోని నాస్తిక కేంద్రంలో ప్రసంగిస్తూ మర ణించారు. గోరా శతజయంతి సందర్భంగా 2002 లో భారత ప్రభుత్వం, తపాలా బిళ్ళను విడుదల చేసింది. నాస్తికత్వం (దేవుడు లేడు), దేవుని పుట్టు పూర్వోత్తరాలు, జీవితం నేర్పిన పాఠాలు, నేను నాస్తికుడిని, సృష్టి రహస్యం, సంఘ దృష్టి, ఆర్థిక సమానత్వం, నాస్తికత్వం - ప్రశ్నోత్తరాలు, నాస్తికత్వం - ఆవశ్యకత తదితర రచనలు చేశారు. ఆయన కోడలైన శ్రీమతి హేమలతా లవణం తన తండ్రి జాషువా రచనలను వెలుగులోకి తెస్తూ, మామగారైన గోరా స్థాపించిన 'నాస్తిక కేంద్రాన్ని' కూడా సమర్థవంతంగా నడిపారు. ఆమె కూడా 19 -03 -2008 న నాస్తిక కేంద్రం, విజయవాడ లోనే మరణించారు.

# బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ప్రకటనలు

## ఫిర్యాదులపై స్పందించిన ఎన్నికల సంఘం

## కాంగ్రెస్ పార్టీ ప్రకటనలపై ఇసి నిషేధం

హైదరాబాద్,నవంబర్14 : ఎన్నికల వేళ తెలంగాణ కాంగ్రెస్‌కు మరో షాక్ తగిలింది. మీడియాలో కాంగ్రెస్ ప్రచార ప్రకటనలపై ఎన్నికల సంఘం నిషేధం విధించింది. బిఆర్ఎస్ ఫిర్యాదుతో స్పందించిన ఇసి పలు ప్రకటనలను నిషేధించింది. ఇవన్నీ కూడా కెసిఆర్ వేషధారణతో సాగుతున్నవే కావడం గమనార్హం. అయితే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే ప్రకటనలపై బ్యాన్ విధించారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఓటమి భయం పట్టుకున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఒత్తిడితోనే ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుందని కాంగ్రెస్ ఆరోపించింది. అసలే ఎన్నికల్లో సోషల్ మీడియా వినియోగం అత్యధిక స్థాయికి చేరుతున్న సంగతి తెలిసిందే. అన్ని పార్టీలు సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నాయి. అయితే, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ పైన సూటిగా ప్రకటనలను తయారు చేయించింది. ఏకంగా గులాబి రంగు కారుతో ప్రచార చిత్రాలను, వీడియోలను తయారు చేయించి ఆ పార్టీని ఓడగొట్టాలనే లక్ష్యంతో కారుకు పంక్చర్లు చేసి తోసేయడం లాంటి దృశ్యాలు దాదాపు అన్ని ప్రకటనల్లోనూ కనిపిస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నేతలు అభ్యంతరాలు పెట్టే స్థాయిలో ఈ యాడ్స్ ఉంటున్నాయని వారు




ఫిర్యాదు చేశారు. సీఈవో వికాస్ రాజ్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ యాడ్స్‌ను నిలిపేయాలని అన్ని మీడియా సంస్థలు,

సోషల్ మీడియా ఛానెళ్లకు బహిరంగ లేఖ రాసింది. వైరల్ అవుతున్న కాంగ్రెస్ ప్రకటనలనే మరోసారి కొన్ని మార్పులతో కాంగ్రెస్ పార్టీ ఎక్స్‌లో రీ పోస్ట్ చేసింది. ఆ వీడియోలో పైన బ్యాన్డ్ అని వేసింది. ఆ ప్రకటన చిత్రీకరణ సమయంలో ఎవరి భావోద్వేగాలు గాయపడలేదని, ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని పేర్కొంది. కేవలం బీఆర్ఎస్ భావోద్వేగాలు తప్ప మరెవరికీ ఇబ్బంది లేదని క్యాప్షన్ పెట్టింది.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

‘ ప్రజా మంటలు” తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, “ నేటి కథ” శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

-ఎడిటర్

# కూతురు ప్రేమ



అనగనగా రంగాపురం అనే గ్రామంలో లలిత ,రమణయ్య దంపతులు ఉండేవారు. వారికి ఒక కూతురు ఉంది. పేరు శైలజ . లలిత ఆరోగ్యం చెడిపోవడంతో శైలజ చిన్నతనంలోనే తన తల్లిని కోల్పోయింది.శైలజ బాగోగులు చూసుకోవడానికి వాళ్ళ నాన్న రమణయ్య భూలక్ష్మి ని రెండో పెళ్లి చేసుకున్నాడు. కొన్ని నెలల పాటు శైలజను ప్రేమగా చూసుకుంది తల్లి భూలక్ష్మి. తన రెండవ భార్య భూలక్ష్మి శైలజని ప్రేమగా చూసుకోవడంతో రమణయ్య మురిసిపోయా డు.రాను రాను భూలక్ష్మి ప్రవర్తన మారిపో యింది. శైలజను కొట్టడం, తిట్టడం చేసేది. శైలజ పాఠశాలకు వెళ్తా అంటే “ఇంట్లో పని ఎంత ఎవరు చేస్తారు ?ఆ పని చేసి వెళ్ళు” అని కోపగించుకునేది భూలక్ష్మి. తల్లి మాటను గౌరవించి శైలజ కోడి కూయక ముందే నిద్రలేచి ఇంట్లో పనులన్నీ చేసేది.రమణయ్య పొలం పనుల కొరకు అంతకన్నా ముందే బావి దగ్గరికి వెళ్లేవాడు. భూలక్ష్మి మాత్రం సూర్యోదయం అయ్యేంతవరకు కూడా నిద్ర లేవకపోయేది. ఒక రోజు శైలజకు బాగా జ్వ రం వచ్చింది.” పొద్దుపోయేదాకా పండుకుం టావా... ?ఇంట్లో పని ఎవరు చేయాలని ఆవేశంతో రగిలిపోయింది భూలక్ష్మి. ఇంట్లో ఉన్న రోకలిబండ తీసుకొని ఒక్క దెబ్బ చేయి పై వేసింది.చేయి నొప్పిగా ఉండటంతో ఏ వస్తువును పట్టుకోలేకపోయింది శైలజ. పొలం నుండి ఇంటికి వచ్చిన రమణయ్య శైలజ చేయి వాపు ఉండటం చూసాడు. వెంటనే హాస్పిటల్ కి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా ఎముక విరిగిందని వైద్యుడు చెప్పాడు.జరిగిన సంగతినంతా గ్రహించిన రమణయ్య ఇంటికి వెళ్లి తన భార్య భూలక్ష్మి పై కోపం తో రగిలిపోయాడు. పక్కనే ఉన్న శైలజ “వద్దు నాన్నా” అని అడ్డుకుంది. అది చూసిన భూలక్ష్మి”నేను తన చేయి విరగొట్టినా...నా బిడ్డ నన్ను కాపాడుతుంది” అని మనసులోనే బాధపడింది తల్లి భూలక్ష్మి.తప్పు తెలుసుకున్న భూలక్ష్మి”నన్ను క్షమించు తల్లీ” అని శైలజ ను గుండెలకు హత్తుకుంది. ఆ రోజు నుండి ఎన్నడూ శైలజను కోపగించుకోలేదు. ప్రేమగా చూడడం మొదలు పెట్టింది.తన తల్లిలో వచ్చిన మార్పుకు శైలజ సంతోషించింది. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లి బాగా చదువుకోసాగింది.

-ఉప్పతల లిఖిత,
7 వ తరగతి, మేళ్ళచెరువు

# రానున్న ఎన్నికల్లో జయితాల పిలుపు ఎటు వైపు?

- ఎమ్మెల్యేగా అన్న నమస్తే ??
  ఎమ్మెల్యేగా అక్క నమస్తే ???
- మరోసారి జయితాలవోటర్ల పయనం ఎటువైపు ??



జయితాల మొదటి నుండి విప్లవ ఊపిరులతో కూడిన చారిత్రక ప్రస్తావనకు కేంద్ర బిందువు. చెర్ల నీళ్ళు తొవ్వ ఎటు ఉంటే అటు పోవడం లా కాకుండా మనసు పడితే ఎదురు పోయి తొవ్వ తీయడం లాంటి సాహస పంథా మన జయితాలది. ఇది 1978 జయితాల జైత్రయాత్ర అయితేనేమి, 2023 సాధారణ ఎన్నికలు అయితేనేమి?? సార్వత్రిక ఎన్నికలలో 1952 నుండి నేటి 2023 వరకు ఎప్పుడూ లేని స్పష్టమైన త్రిముఖ పోరు నెలకొనడము ఉత్కంఠతో కూడిన అసహజ పరిస్థితి. మళ్ళీ మూడవసారి తెలంగాణ రాష్ట్ర సర్కారు పై బారాస జండా పాతేలా కెసిఆర్ ఎన్నో వివిధ ఎత్తుగడల రచన చేసి తీవ్ర కసరత్తుతో ఈ సారి కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కు పోటీలో పాల్గొనే అవకాశం కల్పించాడు.మరో వైపు కాంగ్రెస్ పార్టీ అంటే జీవన్ రెడ్డి అనేది లోకోక్తి. ఇక మరో వైపు అధికార బిఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే చర్యలకు వ్యతిరేకంగా పార్టీ వీడి బిజెపి కాషాయ కండువా కప్పుకుని అతి తక్కువ సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థి గా నిలిచిన మాజీ మున్సిపల్ చైర్మన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్.



**పార్టీల బలాలు, బలహీనతలు. :** కేసీఆర్ రాజనీతి, అధికార పార్టీ, ప్రజాకర్షక సంక్షేమ పథకాల అమలు లు డా. సంజయ్ బలాలుగా ఉంటే గత ఎన్నికతో పోలిస్తే పార్టీ పెద్దలు గానీ కవితక్క గానీ ఈసారి ఎన్నికల ప్రచారంలో ప్రభావంగా చొరవ తగ్గడం, కేడర్ లో ఉత్సాహం నింపలేకపోవడం, అధికారుల నుండి కొంత విముఖతలు ప్రధాన బలహీనతలుగా ఉంటున్నాయి. కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పుంజుకుంటున్న కాంగ్రెస్ అనుకూల పవనాలు, అధికార బిఆర్ఎస్ పార్టీ పై వ్యతిరేకత, నియోజక వర్గంలో 15% పైగా మైనారిటీ ఓట్లు, 5 దఫాల ఎమ్మెల్యే గా పనిచేసిన సుదీర్ఘ రాజకీయ అనుభవం, కాంగ్రెస్ ఆరు పథకాల మానిఫెస్టో ప్రణాళికలు జీవన్ రెడ్డికి ప్రధాన బలాలు గా ఉంటే యువ కార్యవర్గ లోపం, ప్రభావవంతం అయిన ద్వితీయ శ్రేణి కేడర్ లేకపోవడం, కేంద్ర రాష్ట్ర స్థాయిలో నిర్దిష్ట ప్రణాళిక లోపం, దశాబ్ద కాలంగా పెరిగిన యువ ఓటర్ల ను ఆకర్షించకపోవడంలు ప్రధాన బలహీనతలు గా ఉంటున్నాయి.కాగా రాష్ట్రంలో కేంద్ర బిజెపి బిసి డిక్లరేషన్, మహిళా ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉండడం, అధికార పార్టీ పై అసమ్మతి వర్గం, ధర్మపురి అరవింద్, ఈటెల రాజేందర్ లాంటి రాష్ట్ర స్థాయి మరియు వివిధ స్థానిక నాయకుల మద్దతు,లోకల్ కేడర్ లో నూతనోత్తేజం, 33% మహిళా రిజర్వేషన్ బిల్లు, మోడీ మానియా లు డా. భోగ శ్రావణి ప్రవీణ్ లకు బలాలు గా ఉండగా గతంలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా నిలుచున్న నాయకులు పార్టీ బలోపేత నిర్మాణంలో సరియైన పాత్ర పోషించలేకపోవడం, అలాగే పార్టీ కూడా కేడర్ ను నిలుపుకోవడం గానే ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక, తక్కువ సమయంచే అధికార సమన్వయం లోపం, బిఎస్ పి పార్టీ అభ్యర్థి బిసి ఓటు చీలిక లు ప్రధాన బలహీనతలు గా ఉంటున్నాయి. నియోజక వర్గంలో 50% పైగా ఉన్న బి.సి ఓటర్లు, 50% పైగా ఉన్న మహిళా ఓటర్లు, యువత ఓట్లే ప్రధాన ప్రాధాన్యత శక్తిగా ఉన్నాయని అలాగే దళితుల ఓట్లు కూడా ప్రత్యేక బలంగా మారుతున్నాయని, ఈసారి బిజెపి విజయం నైతిక విజయం, ధర్మ విజయం, ప్రజా విజయం అని బిజెపీ వర్గాలు విశ్వాసం తెలియజేస్తున్నారు.

**పోలింగ్ నమోదు శాతం కీలకం. :**

జగిత్యాల నియోజకవర్గంలో గడిచిన రెండు సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ దాదాపు 79% శాతంగా నమోదు అయ్యింది అంటే 2014సం. తో పోలిస్తే 2018సం. లో 7% శాతం పోలింగ్ నమోదు పెరిగింది. ఇలా పోలింగ్ శాతం ప్రతీ దఫా పెరగడంలో కేంద్ర రాష్ట్ర ఎన్నికల సంఘం, కలెక్టర్, పోలీస్ యంత్రాంగం ల అనుసంధాన కృషి అనిర్వచనీయం. ఈసారి 2023సం. కూడా మరొక 10% పోలింగ్ శాతం పెరిగితే అంటే 89-90% శాతం వరకు చేరితే ఎంతో బలమైన ప్రజామోదం కలిగిన నేతగా గెలవబోయే ఎమ్మెల్యే చరిత్రలో నిలిచిఉంటారు.ప్రజలు వారి వారి అంచనాలతో జయితాల కూడళ్లు, రచ్చబండ లో తరం మారింది స్వరం మారాలి అనే నినాదం ఎత్తుకొని “ నమస్తే ఎమ్మెల్యే అన్న నుండి నమస్తే ఎమ్మెల్యే అక్క అనే పిలుపుకు “ కూడ సిద్ధం కావాల్సిందే అనేదే చర్చ... ఏది ఏమైనప్పటికీ జయితాల ప్రజలు మాత్రము వారి స్పుర చిత్తం తో ప్రజా ప్రయోజనం గా భాధ్యత గల వారినే వారి ప్రతినిధిగా ఎన్నుకుంటారు. అలా మరొక్కసారి జయితాల జైత్రయాత్ర రాష్ట్ర రాజకీయాలలో కీలకంగా నిలుస్తుంది అని మేధావి వర్గాల అంచనా. ప్రశ్న పత్రం ఏదైనా పరీక్షలో విజయం కట్టబెట్టేది మాత్రం ప్రజలే... ప్రజా ప్రతినిదులు తస్మాత్ జాగ్రత్త...!!!

సిరిసిల్ల. రాజా విక్రాంత్ శర్మ.
9963349493.

# ఓటరు స్లిప్పు పంపిణీ కట్టుదిట్టమైన చర్యలు

## క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు చర్యలు



**భూపాలపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్ 14 (ప్రజామంటలు):** అసెంబ్లీ ఎన్నికలలో ఓటర్లు అందరికీ తప్పనిసరిగా ఓటర్ స్లిప్పులు పంపిణీ చేసే విధంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ , ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీ పై జిల్లా ఎన్నికల అధికారుల తో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొం దించుకోవాలని, దీనికి అవసరమైన మేర యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని, స్థానికం గా అందుబాటులో ఉండే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతను వెబ్ క్యాస్టింగ్ కోసం వినియో గించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఓటరు స్లిప్పుల అందలేదని గతంలో అనేక ఫిర్యాదులు ఉన్నాయని, వీటి నివారణ కోసం ఎన్నికల కమిషన్ ముందస్తుగా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిందని, పోలింగ్ కేంద్రాల వారిగా ఓటరు స్లిప్పుల ముద్రణ చేసి వాటి పంపిణీ పకడ్బందిగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## కథలాపూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**కథలాపూర్ నవంబర్ 14 (ప్రజామంటలు):** కథలాపూర్ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్ పరిసరాలను మరియు రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్ హెచ్ వో, లాక్ అప్ రూమ్ ను 5ఎస్ అమలు తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న నేరస్తుల, రౌడీ షీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్ లు నిర్వహించి ఓటర్ల కు భద్రతా భావాన్ని కలిగించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేసారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు చేసిన లేదా అల్లర్లను సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, ఓటర్లను ప్రభావితం చేసే ఎన్నికల నేరస్థులపై, రౌడీ షీటర్ల పై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉ న్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రవీంద్ర రెడ్డి, సి.ఐ ప్రవీణ్ కుమార్, ఎస్.ఐ కిరణ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**గొల్లపల్లి నవంబర్ 14 (ప్రజామంటలు):** సెక్టార్ లోని అంగన్వాడీ కేంద్రాలలో బాలల దినోత్సవ వేడుకలు తిరుమలాపూర్, అగ్గిమల్ల, రంగధాముని‌పల్లి, దట్నూరు, చెందోలి, చిలువకోడూరు, గోవిందుపల్లి, గొల్లపల్లి, దమ్మన్నపేట సూపర్వైజర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జవహర్లాల్ నెహ్రూ నవంబరు 14న 1889 లో జన్మించారు. జవహర్లాల్ నెహ్రూ శాంతి దూత అని అంటారని పిల్లలు అంటే చాలా ఇష్టం అని గులాబీలు అంటే ఇష్టమని తలపై తెల్లని టోపీ ఎదపై ఎర్ర గులాబీ చేతిలో తెల్లని పావురం చాచా నెహ్రూ అంటారని పిల్లలకు నెహ్రూ వేషధారణలు వేయించడం జరిగినది దీని యొక్క ప్రాముఖ్యత గురించి పిల్లలతో మాట్లాడించడం వారికి అవగాహన కలిగించారు. అన్నప్రాశన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్ మమత ఏన్ఎం లక్ష్మి, ఆశాలు, తల్లులు పిల్లలు గర్భవతులు, బాలింతలు, అంగన్వాడీ టీచర్స్, ఆయాలు అందరూ పాల్గొన్నారు.

## కలికోట చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**కథలాపూర్ నవంబర్ 14 (ప్రజామంటలు):** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. కథలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన కలికోట డిస్ట్రిక్ట్ బార్డర్ చెక్ పోస్ట్ ను జిల్లా ఎస్పి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ.... ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తామని, నగదు, మద్యంపై ఉచిత పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఎన్నికల నియమావళి అమల్లోకి ఉన్నందున పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఫోర్స్మెంట్ వర్క్ జరుగుతుందని, ఎవరూ ఓటర్లను ప్రలోభపెట్టే ఏలాంటి చర్యలకు దిగవద్దని, పట్టుబడితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సరైన ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తం లో డబ్బులను తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. చెక్ పోస్ట్ సిబ్బంది వాహనాల తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు, సిబ్బందికి ఎస్పి సూచించారు.

## సారంగాపూర్ మండలం పలు తండాలలో ప్రచారం నిర్వహించిన డాక్టర్ సంజయ్, రాజేశం గౌడ్



**సారంగాపూర్ నవంబర్ 14 (ప్రజామంటలు):** మండలంలోని తలుపుల గూడెం, మ్యాడారం తండా,భీమ్ రెడ్డి గూడెం, రెచ పల్లి,లచ్చా నాయక్ తండా, కొత్త పల్లి తండాలలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్నర్ మీటింగ్ లో పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను, బిఆర్ఎస్ పార్టీ అమలు చేయనున్న మ్యానీ ఫేస్టో ను వివరించి, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, మండలాన్ని, గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని తెలుపుతూ ప్రజలకు ఓటు వేయాలని అభ్యర్థించిన ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్ ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎన్నికల ఇంచార్జి రాజేశం గౌడ్. ఈ కార్యక్రమంలో గ్రామ మండల, గ్రామ ప్రజా ప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తెలంగాణ గురుకులాలు

### టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షులు, అంబాల ప్రభాకర్



**జమ్మికుంట నవంబర్ 14 (ప్రజామంటలు):** సాంఘిక సంక్షేమ గురు కుల విద్యాలయాలలో చదువుకొని చదువుతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి దశగా అడుగులు వేస్తూ తనకు తోచినంతగా బడుగు, బలహీన వర్గాల నిరుపేదలకు విద్య వైద్యంపై కష్టాలలో, కన్నీళ్ళతో, దుఃఖంలో ఉన్న వారిని నేనున్న అంటూ తన సహాయ, సహకారాలు అందిస్తున్న గురుకుల పూర్వ విద్యార్థి అంబాల ప్రభాకర్ ప్రభు. ఈ సందర్భంగా టి జి పి ఏ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ ప్రభు మాట్లాడుతూ....1989లో నాలుగో తరగతి నుండి ఇంటర్మీడియట్ 1997 వరకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో విద్యాభ్యాసాన్ని ఉచిత విద్య ద్వారా పూర్తి చేసుకుని, చదువు తో పాటు క్రీడలు కళలు, లీడర్షిప్ క్వాలిటీస్, సమాజంలో ఏ విధంగా బ్రతకాలని విధానాన్ని గురుకుల గురువులు చెప్పిన మాటలను తూచా తప్పకుండా పాటించడం ద్వారా చదువుతోపాటు అన్ని రంగాలలో నైపుణ్యత సాధించి సమాజంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని తెలిపారు. అదేవిధంగా తన పిల్లలను కూడా చదువుతోపాటు అన్ని రంగాలలో అభివృద్ధి చెందేలా గురుకుల గురువులు చేస్తారని నమ్మకంతో కరీంనగర్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సిఓఐ అలుగునూర్ చదివిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా సామాజిక బాధ్యతతో చదువుకున్న గురుకులాలకు కావలసిన అవసరాలకు అనుకూలంగా తల్లిదండ్రులను ఐక్యం చేసి వారి సహాయ సహకారాలతో అలుగునూర్ సిఓఈ ని కార్పొరేట్ కాలేజీలకు దీటుగా అందంగా తీర్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా గురుకులాలలో చదివిస్తున్న విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సామాజిక బాధ్యతతో తమ పిల్లలు చదివిస్తున్న విద్యాలయాలలో నాణ్యమైన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలకు గురుకుల విద్యాలయ గురువులతో మమేకమవుతూ మన పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం విద్యార్థుల మౌలిక సదుపాయాల కల్పన కోసం సిఓఐ ప్రిన్సిపల్ దేవేందర్ రెడ్డి కి తన వంతు సహాయంగా 5000 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపల్ రామ్ సింగ్, పద్మ, జ్యోష్ణ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామం అంగన్వాడి కేంద్రం-2 లో దేశ మొదటి ప్రధాని చాచా నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సంకోజు పద్మారాణి ప్రీ స్కూల్ పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సామాజిక సేవకురాలు, బిజెపి నాయకురాలు కర్ణకంటి మంజులా రెడ్డి హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. పార్టీ గెలుపు కొరకు తనవంతు కృషి చేస్తానని మంజులక్క అన్నారు.



ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో బిఆర్ఎస్ నాయకురాలు మాజీ ఎంపీపీ మేకల కోమల, తంగేడ షాలిని మహేందర్ ఉద్యమ నాయకురాళ్లు అనిత-నగేష్. రాధిక-సాంబమూర్తి, కమల తదితరులు పాల్గొన్నారు. జై బిఆర్ఎస్ సతీష్ అన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేస్తూ అభివృద్ధి పనులు తెలియపరుస్తూ ప్రచారం చేశారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**కొడిమ్యాల నవంబర్ 14 (ప్రజా మంటలు):** దేశ మొదటి ప్రధాని చాచా నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని కొడిమ్యాల్ మండల కేంద్రంలోని విజ్ డమ్ విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుల వేషధారణలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇట్టి కార్యక్ర మంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయుని ఉపాధ్యా యులు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏకెవిఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులచే ఓటర్ ప్రతిజ్ఞ



**భీమదేవరపల్లి నవంబర్ 15 (ప్రజా మంటలు):** జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా ముల్కనూర్ ఏకెవిఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులచే అధ్యాపక బృందం ప్రమాణం చేయించారు. "ప్రజా స్వామ్యంపై విశ్వాసంతో, మన దేశ ప్రజా స్వామ్య, సాంప్రదాయాలను, స్వేచ్ఛా యుత, నిష్పక్షపాత ప్రశాంత ఎన్నికల ప్రభా వాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష, ఎటువంటి ఒత్తిడిలకు ప్రభా వితం కాకుండా, ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని, ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము" అని అధ్యాపక బృందం విద్యార్థులు చెప్పారు.


## సండ్రాల్లపల్లిలో ఘనంగా బాలల దినోత్సవం



**కొడిమ్యాల నవంబరు 14 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలమ్ లోని సండ్రాలపల్లి ప్రాథమిక పాఠశాలలో జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి, ఉపాద్యాయులు స్వర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## హస్తంలోకి కమలం, గులాబీలు

### పొన్నం సమక్షంలో చేరిన యువకులు



**భీమదేవరపల్లి నవంబర్ 15 (ప్రజా మంటలు):** మండలంలోని రత్నగిరి గ్రామం నుండి యువజన కాంగ్రెస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చిదురాల సురేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బినవేని రాకేష్ ఆధ్వర్యంలో హస్తం లోకి గులాబీ, కమలంలకు చెందిన యువ కులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హుస్నా బాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ సమక్షంలో పార్టీ కార్యాల యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంతాల శివారెడ్డి, అక్కనపేట యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దామోదర్, విద్యాసాగర్, శ్రీకాంత్, నవీన్, మహేష్, సురేష్, అనిల్, కళ్యాణ్, నితిన్, సందీప్, అజయ్, విష్ణు, చందు, ప్రశాంత్, గణేష్, తరుణ్, సాయికిరణ్, అరవింద్ తదితర యువజన కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొన్నం గెలుపుకు ప్రణాళిక సిద్ధం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బత్తుల బాబు



**సైదాపూర్ నవంబర్ 14 (ప్రజా మంటలు):** సైదాపూర్ మండలంలో సిపిఐ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ ఈ మండలంలో ప్రచారం చేయను న్నారు. అందులో భాగంగా బుధ వారం సర్వాయి పేటలో ప్రారంభం కాగా జాగిరిపల్లిలో ముగుస్తుందని అందుకోసము సిపిఐ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా సిపిఐ ప్రచార కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల బాబు తెలిపారు. ఈ కమిటీలో వొజ్జ కొమురయ్య , జడల రాజేశం, ఒడ్నాల వెంకటేష్, పుట్ట సంపత్, నలువాల రవి, కొమ్ముల సమ్మయ్య, భాషవేణి శ్రీనివాసు, లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి సమన్వయ కర్తగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కంది రవీందర్ రెడ్డి వ్యవహా రిస్తారని బత్తుల బాబు తెలిపారు. కావున కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

prajamantalau daily pages (15-11)_times of varha main (13-2).qxd 11/15/2023 12:56 AM Page 5



# ప్రతి ఓటర్ కు ఓటర్ స్లిప్పు సకాలంలో అందేలా చూడాలి

## రాష్ట్ర సంయుక్త ఎన్నికల అధికారి



**జగిత్యాల నవంబర్ 14 (ప్రజామంటలు):** ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పు అందేలా ప్రణాళికలతో కార్యాచరణను జిల్లాలో అమలు పరచాలని రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. హైదరాబాద్ నుండి రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీ, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫ రాజ్ అహ్మద్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించు కోవాలని, దీనికి అవసరమైన మేరకు సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని, స్థానికంగా అందుబాటులో ఉండేకంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన యువతను వెబ్ క్యాస్టింగ్ కోసం వినియో గించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఓటరు స్లిప్పులు అందలేదని గతంలో అనేక ఫిర్యాదులు ఉ న్నాయని, వీటి నివారణ కోసం ఎన్నికల కమిషన్ ముందస్తుగా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిం దని, పోలింగ్ కేంద్రాల వారిగా ఓటరు స్లిప్పుల ముద్రణ చేసి వాటి పంపిణీ పకడ్బందిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ పర్యవేక్షణ కోసం నోడల్ అధికారిని నియమించాలని, ఓటరు స్లిప్పుల పంపిణీ అంశంలో ఫిర్యాదులు ఉంటే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఓటరు స్లిప్పుల పంపిణీ షెడ్యూల్ ను రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తుగా తెలియజేయాలని, వివిధ రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లను సైతం ఓటరు స్లిప్పుల పంపిణీలో భాగస్వామ్యం చేయాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీపై ప్రతి రోజూ నివేదికలు సమర్పించాలని, ప్రతి ఒక్క ఓటరుకు తప్పనిసరిగా ఓటరు స్లిప్పు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటరు జాబితా పై వచ్చిన ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యల వివరాల రిజిస్టర్ లలో నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు, వారి అనుచరులకు సి- విజిల్ యాప్ పై అవగా హన కల్పించాలని, సి- విజిల్ యాప్ ను విస్తృతంగా వినియోగించడం వల్ల పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలను అరికట్టేందుకు ఉపయోగపడు తుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా ఎన్ని కల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ వెబ్ కాస్టింగ్ కోసం జెఎన్ టీయూ కళాశాల 500 మంది విద్యార్థుల ను వెబ్ కాస్టింగ్ కోసం ప్రతిపా దించామని వారందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని ప్రత్యేకంగా కోరడం జరిగిందని తెలిపారు. అనంతరం జిల్లాలోని రిటర్నింగ్ అధికారుల తో కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్లందరికి ఓటరు స్లీప్ లు, ఓటరు గైడ్ లను పంపిణీ తో పాటు, సి - విజిల్ యాప్ ను ప్రతీ ఒక్కరు డౌన్ లోడ్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, అందుకు షెడ్యూల్ సిద్దం చేసి, ఉత్తర్వులు జారీచేయాలన్నారు. పంపిణీ వివరాలు రిజిస్టర్ లో నమోదు చేసి, ఓటరు సంతకాలు తీసుకోవాలని సూచించారు. రోజువారీ పంపిణీ వివరాలను సమర్పించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమా వేశం నిర్వహించాలని తెలిపారు. మోడల్, మహిళా, పి.డబ్ల్యు. డి., యువత కు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలలో వసతులు, సౌకర్యాలు పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు నెంబరింగ్ చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర, ఆర్డీఓ/రిటర్నింగ్ అధికారులు నరసింహ మూర్తి, రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు దేవరాజ్, నరేష్, ఎన్. భీమ్ కుమార్, ఈడిఎం మమత, తదితరులు పాల్గొన్నారు.

# భీమదేవరపల్లి భీమేశ్వర ఆలయంలో అన్నదానం..

**నవంబర్ 22 నుండి 50 రోజులపాటు అయ్యప్ప స్వాములకు భిక్ష**

**దాతల సహకారంతో కొనసాగింపు**



**భీమదేవరపల్లి నవంబర్ 15 (ప్రజామంటలు):** నవంబర్ 22 నుండి కార్తీక మాస దీక్ష పురస్కరించుకొని, భీమదేవరపల్లి భీమేశ్వర ఆలయంలో ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు అయ్యప్ప స్వామి దీక్షాదారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు మండల అయ్యప్ప సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. కార్తీక మాసంలో మాల వేసుకునే భక్తులకు ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం 50 రోజులు పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో అయ్యప్ప స్వాములు వచ్చి అన్నదాన కార్యక్రమం పాల్గొనాలని కోరారు. విరాళాలు ఇచ్చే దాతలు నేరుగా భీమేశ్వర ఆలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల అయ్యప్ప దీక్ష తీసుకునే భక్తులు పాల్గొన్నారు.

**చిల్వకోడూర్ ప్రభుత్వ హై స్కూల్‌లో షీ టీం, ఏ హెచ్టి యూ టీమ్ ఆధ్వర్యంలో**

# విద్యార్థినిలకు అవగాహన




**గొల్లపల్లి నవంబర్ 14 (ప్రజామంటలు):** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వకోడూర్ ప్రభుత్వ హై స్కూల్ లో షీ టీం, ఏ హెచ్ టి యూ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలో మహిళలు హక్కులు, రక్షణకు షీ టీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. అదే విధంగా షీ టీం పని విధానం, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, యువతులు, విద్యార్థినిలు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం నెంబర్‌కి 8712670783 సంప్రదించాలన్నారు. సామాజిక మధ్యమాలైన ఫేస్ బుక్, వాట్స్ అప్, ఇన్ స్టాగ్రామ్ ల వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని , ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేసే సమయంలో, వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మహిళా కానిస్టేబుల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# నా ధైర్యం మీరు, మీ కోసం కొట్లాడుతా

**డా. బోగ శ్రావణి**



**జగిత్యాల నవంబర్ 14 (ప్రజామంటలు):** నా ధైర్యం మీరు. నన్ను ఆదరించి, అవకాశం కల్పిస్తే మీకోసం, మన హక్కుల కోసం నియోజకవర్గం అభివృద్ధి కొట్లాడుతానని బిజెపి నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ బోగ శ్రావణి ప్రవీణ్ అన్నారు. రాయికల్ మండలంలోని అయ్యోధ్య, ఉప్పుమడుగు, కుమ్మరిపల్లి రాజ్ నగర్, గ్రామాల్లో గడప గడప కి బిజెపి కార్యక్రమం లో భాగంగా ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్బంగా శ్రావణి మాట్లాడుతూ.... ఓట్ల పండగ వచ్చింది కాబట్టి అన్నీ పార్టీల నాయకులు వస్తారని, ప్రజల కోసం పనిచేసే పార్టీని ఆదరించాలని కోరారు. తెలంగాణ పల్లెల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్నో నిధులు వస్తున్నయని వాటి వివరాలు మీరంతా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తమను గెలిపిస్తే మహిళలు బస్ లో ఫ్రీ గా వెళ్లొచ్చు అని చెప్తున్నారని, కానీ అయ్యోధ్య గ్రామానికి బస్ లేనప్పుడు ఉచిత ప్రయాణం ఎట్లా చేస్తారని గ్రామస్తులు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. కేవలం రైతు బంధు ఇచ్చి, తరుగు పేరుతో బీఅర్ఎస్ ప్రభుత్వం రైతులను దోపిడీ చేస్తుందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కేవలం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు వచ్చి, రిబ్బన్ కటింగ్ చేసి వెళ్లడం తప్ప, ఎనడైనా రైతుల గురించి మాట్లాడారా? అటు తొంగి చూశారా? అలాంటప్పుడు కారు గుర్తు కు ఓటయమని ఏలా అడుగుతారో ప్రజలే ఆలోచించాలన్నారు. బిజెపి ఎంపీ అర్వింద్ గారు ఇచ్చిన మాట ప్రకారం పసుపు బోర్డు తెచ్చారని, ప్రస్తుతం ముత్యం పేట్ చక్కర ఫ్యాక్టరిని తెరిపించేందుకు సైతం మళ్ళీ బండ్ పేపర్ రాసిచ్చారని గుర్తు చేశారు. తనను గెలిపిస్తే తరుగు లేకుండా వడ్ల కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపట్టే బాధ్యత నాదని శ్రావణి హామీ ఇచ్చారు. రైతులు బిజెపిని ఆదరించాలన్నారు. ఇతర పార్టీలకు ఓటేస్తే పెన్షన్ పోతుందని బీఅర్ఎస్ నాయకులు ప్రజలను భయభ్రంతులకు గురి చేస్తున్నారని ఆరోపించిన శ్రావణి గారు, ఎంపీ గా ప్రస్తుత ఎమ్మెల్సీ కవిత ఒడితే పెన్షన్ లు బంద్ అయ్యాయా అని ప్రశ్నించారు. బిజెపి అధికారం లోకి వస్తే పథకాలు కొనసాగించడం తో పాటు, రెట్టింపు అవుతాయని గమనించాలని కోరారు. అయ్యోధ్య గ్రామంలో కనీసం మౌలిక వసతులు కల్పించడం లేదని గ్రామ ప్రజలు గోస పడుతున్నారని, రాష్ట్రం ప్రభుత్వం నిధుల విడుదల చేయకపోవడంతో కేంద్రం నిధులతో గ్రామ పంచాయితీల్లో పాలనా సాగుతుందని గమనించాలని కోరారు. పొదుపు సంఘాల్లో ముద్ర, వీధి వ్యాపారులకు లోన్ లు మోదీ సర్కార్ ఇస్తుందని, మరి దళిత, బిసి, మైనారిటీ బంద్ లు అయ్యోధ్య గ్రామంలో ఎంత మందికి వచ్చాయో ఆలోచించాలన్నారు. కేంద్రం నిధులు ఇస్తుందని బీఅర్ఎస్ నాయకులు ఎక్కడ చెప్పడం లేదని, ప్రజలు బిజెపి ని మెచ్చుకుంటారనే అక్కసుతో మోదీ పేరు గాని, కేంద్రం ప్రభుత్వం గురించి గానీ చెప్పడం లేదన్నారు. ఈ గ్రామానికి జనవరి నుంచి ఇప్పటి వరకు 18 లక్షలు 2 వేలు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 1.90 వేలు ఇచ్చిందని గుర్తు చేశారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం నిధులు విడుదల చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పైసలు ఆ లక్ష ఎక్కడ ఖర్చు పెట్టారో మీరే ఆలోచించాలన్నారు. బీఆరెస్ నాయకులు మధ్యలో ఉన్నోళ్ల జేబులు నింపుకుంటున్నారని ఆరోపించారు. వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు బిజెపి ప్రతినిధులుగా మేము మీ దగ్గరికి రావడం జరిగిందని ఆడబిడ్డ కు ఎమ్మెల్యే గా పోటీ చేసే అవకాశం ఇచ్చిన బిజెపి పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, రాయికల్ మండల అధ్యక్షులు అన్నవేని వేణు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, బూతు అధ్యక్షులు జితేందర్ రెడ్డి, ధర్మరాజు, ఉపసర్పంచ్ ఏనుగు రవీందర్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు సుజాత, మండల ఉపాధ్యక్షులు పసుపునురి శ్రీనివాస్, కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు కోరే రాజ్ కుమార్, బూత్ అధ్యక్షులు కంచర్ల అంజన్న, గ్రామ శాఖ అధ్యక్షులు భారతపు రాజు, వార్డు మెంబర్ తిరుపతి, సిరిపురం గంగాధర్, మిట్టపల్లి మహేష్, పసుపునూరి రాజేష్, జైనారపు భీమన్న, తాటిపల్లి రాజేశ్వర్ రెడ్డి, జలపతి, గుగులోతు రవి, జవహర్ లాల్, శీను నాయక్, రమేష్ నాయక్, రైడర్స్ యూత్ సభ్యులు కుమ్మరిపేట గ్రామ శాఖ సభ్యులు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్ కు మద్దతుగా**

# జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఇంటింటి ప్రచారం



**జగిత్యాల నవంబర్ 14 (ప్రజామంటలు):** జగిత్యాల రూరల్ మండల పోలాస గ్రామంలో జగిత్యాల ఎమ్మెల్యే అభ్యర్థి డా. సంజయ్ కుమార్ కి మద్దతుగా ఇంటింటా ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, ఎమ్మెల్యే సతీమణి రాధిక. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రప్రసాద్, రూరల్ %ు%అర్బన్ మండల పార్టీ అధ్యక్షులు బాల ముకుందం, సురేందర్ రావు, పాక్స్ చైర్మన్ సందీప్ రావు, మాజీ సర్పంచ్ నరేష్, మండల కో ఆప్షన్ మెంబర్ జావిద్, గ్రామశాఖ అధ్యక్షుడు రాంశంకర్, ఏఎంసి డైరెక్టర్ సురేష్, మోతె గ్రామ సర్పంచ్ స్వప్న రాజేశ్వర్ రెడ్డి, గ్రామ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు



**సనత్ నగర్ నవంబర్ 14 (ప్రజామంటలు):** దివంగత మాజీ ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 134వ జయంతి వేడుకలను టీపిసిసి ఎన్నికల మేనిఫెస్టో కమిటీ మెంబర్ మర్రి ఆదిత్య రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బన్సీలాల్ పేట డివిజన్ సిసినగర్ లో చాచా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సెక్రెటరీ ఎన్. విఠల్, నాయకులు డాక్టర్ శివకుమార్ లాల్, కె హేమలత, సిపి శంకర్, కే దానయ్య, దశరథ్, రాము, సురేష్, కృష్ణ, జగదీష్, విలాస్ రావు పాల్గొన్నారు.

# శీలం ప్రభాకర్ ఆశయాలను కొనసాగించాలి



**సికింద్రాబాద్ నవంబర్ 14 (ప్రజామంటలు):** దివంగత మాజీ కార్పొరేటర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు శీలం ప్రభాకర్ ఆశయాలను కొనసాగించడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని టిపిసిసి ఎన్నికల మేనిఫెస్టో కమిటీ మెంబర్ మర్రి ఆదిత్య రెడ్డి అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన శీలం ప్రభాకర్ కుటుంబానికి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్పొరేట్ గా, కాంగ్రెస్ నాయకుడిగా రాంగోపాల్పేట డివిజన్‌లో శీలం ప్రభాకర్ చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఆయన వెంట టిపిసిసి సెక్రటరీ ఎన్. విఠల్, నాయకులు మనోజ్, శివలాల్, ఇబ్రహీం, శైలేష్, నవీన్, కృష్ణ, నాగరాజు తదితరులు ఉన్నారు.

# కలిసికట్టుగా పని చేద్దాం.. కార్మిక సమస్యలు పరిష్కరిద్దాం

**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు**



**భూపాలపల్లి ప్రతినిధి నవంబర్ 14 (ప్రజామంటలు):** ఈ ఎన్నికల్లో భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్తన్నకు పూర్తి మద్దతునిచ్చి, భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ కు అనుకూల పవనాలు ఉన్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఏఐటియూసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, వైయస్ఆర్టిపి జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ అన్నారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ, సిపిఐ, వైఎస్ఆర్టీపి ముఖ్య నాయకులతో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కొరిమి రాజ్ కుమార్ మాట్లాడుతూ కార్మిక సమస్యలను కేసీఆర్ బీజేపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని ట్రేడ్ యూనియన్ లను నిర్వీర్యం చేశారని కార్మిక సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ వ్యవహరిస్తున్నారని కార్మిక సమస్యలు ఇప్పటివరకు పరిష్కారం కాలేదని గుడిసె వాసులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉండాలని తెలిపారు భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, వైయస్ఆర్టిపి జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ లతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి కార్మికుల సమస్యలు పరిష్కరిద్దామని అన్నారు. రాష్ట్రంలో పదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో అధికార దుర్వినియోగం, అవినీతి సొమ్ముతో సీఎం కేసీఆర్ కుటుంబంలో అహంకారం పెరిగిపోయిందని, ఈ ఎన్నికల్లో వారి అహంతోనే వారు ఓటమి పాలవుతున్నారని చెప్పారు. బీఆరెస్‌కు ఓటు వేస్తే అది బీజేపీకి వేసినట్లేనన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నాయన్నారు. ప్రజల్లో మార్పు కనిపిస్తుందని, ఒక్క ఓటు దెబ్బతో ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆరెస్, మోసపూరిత ఎంఐఎం పార్టీలను మూడింటిని దెబ్బకొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ తెలంగాణ ద్రోహులను పక్కన పెట్టుకున్నారని, కేసీఆర్ కేబినెట్ అంతా తెలంగాణ ద్రోహలతో నిండిపోయిందనని వారు ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లు ఏదైనా ప్రాజెక్టు గేట్లు ఊడిపోవడం కొట్టుకపోవడమో విన్నామని, కానీ, నిర్మాణం చేపట్టిన తక్కువ సమయంలో పునాదులతో సహా కదిలిపోయిన ప్రాజెక్టు ఒక కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమేనని అన్నారు. ప్రాజెక్టుల పునాదులు కదిలిపోతుంటే బీఆరెస్ నేతల ఫామ్ హౌజ్‌లు కమిషన్లతో దోచుకున్న డబ్బులతో నిండిపోతున్నాయని ఆరోపించారు. దళిత బంధు, రైతురుణమాఫీ పేరుతో అనేక ఇబ్బందులు పెట్టారన్నారు. మాకు పొత్తులో భాగంగా కాంగ్రెస్ సీపీఎం, టీజేఎస్, వైఎస్సార్టీపీ మద్దతు ప్రకటించాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన 6 గ్యారెంటీలను తప్పక అమలు చేస్తుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, టిపిసిసి సభ్యుడు చల్లూరి మధు, మాజీ టీపీసీసీ సభ్యుడు చల్లూరి సమ్మయ్య, జిల్లా నాయకుడు బుర్ర కొమురయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ పిప్పాల రాజేందర్, పట్టణ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, కురిమిళ్ళ శ్రీనివాస్, ఉడుత సరోజన - రాజమల్లు, ముఖ్య నాయకులు క్యాతరాజు సాంబమూర్తి, కొరిమి సుగుణలతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.





జగిత్యాల జిల్లా కేంద్రంలోని శాతవాహన యు.పి.ఎస్. పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు. అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

prajamantalau daily pages (15-11)_times of varha main (13-2).qxd 11/15/2023 12:56 AM Page 6



# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



మొగుళ్ళపల్లి / భీమదేవరపల్లి నవంబర్ 15 (ప్రజామంటలు) : జెడ్పిహెచ్ఎస్ రంగాపురం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత ఇంచార్జ్ హెచ్ఎం శ్రీదేవి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చాచా నెహ్రూ స్ఫూర్తితో బాగా చదువుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని చెప్పింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు సత్యనారాయణ, శర్మ, మార్కండేయ, పద్మ, అనిత, పిఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, సదానందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి హైస్కూల్లో బాలల దినోత్సవం



కోరుట్ల నవంబర్ 14 (ప్రజామంటలు): కోరుట్ల పట్టణంలోని గడి బురుజు వద్ద గల విశ్వ శాంతి హైస్కూల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బ్రహ్మన్నగారి శంకర్ శర్మ, ప్రిన్సిపాల్ చీటీ సత్యం రావులు మాట్లాడుతూ.... విద్యార్థి దశలో బాలల దినోత్సవం అనేది ఒక మరపురాని సంఘటనగా ఉంటుందని ఈరోజు విద్యార్థులు తామే గురువులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పడం వారికి ఒక మధురాను భూతిని కల్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ నెక్స్ట్ జెన్‌లో ఘనంగా చిల్డ్రన్స్ డే



హుజూరాబాద్ నవంబర్ 14 (ప్రజామంటలు): హుజూరాబాద్ పట్టణం లోని స్థానిక విజ్ఞాన్ నెక్స్ట్ జెన్ పాఠశాలలో మంగళవారం రోజున భారత ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని కూడా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోనీ కొంతమంది పిల్లలు ఒకరోజు టీచర్స్ గా తమ బాధ్యతలు నెరవేర్చారు. తదనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు మాట్లాడుతూ టీచర్స్ యొక్క పాత్ర గొప్పదని, పాఠాలు చెప్పడానికి వారు చేసే ప్రిపరేషన్ చాలా విలువైనది, ఈరోజును మా జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేమని, తమకు చదువు నేర్పుతున్న పాఠశాలకు, ఉపాధ్యాయులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ తమ అనుభూతులను పంచుకున్నారు. ఆ తర్వాత పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్ మాట్లాడుతూ.... నెహ్రూకి పిల్లలు అంటే చాలా ఇష్టమని, అందుకే తనని పిల్లలు ప్రేమతో చాచా నెహ్రూ అని పిలుస్తారని, పాఠశాలలో చదువుతున్న పిల్లలందరూ నెహ్రూ అంతటి గొప్పవారు కావాలని కోరారు. తదనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమానంతరం పాఠాలు బాగా బోధించిన స్టూడెంట్ టీచర్స్ కి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దాసరి కోటేశ్వర్, డైరెక్టర్ తిరుపతి యాదవ్, ప్రిన్సిపాల్ కొండబత్తిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ రాజ్య కిరీటం బిఆర్ఎస్ దే



సైదాపూర్ నవంబర్ 14 (ప్రజామంటలు): సైదాపూర్ మండలం బోమ్మకల్ గ్రామంలో హుస్నాబాద్ నియెజకవర్గ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బోమ్మకల్ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రారపు రాజేంద్రప్రసాద్ రానున్న ఎన్నికల్లో సతీష్ కుమార్ ను బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే సతీష్ కుమార్ ను అధిక మేజార్టీతో గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సతీష్ కుమార్ హుస్నాబాద్ నియెజకవర్గంలో రాష్ట్ర మంత్రులతో పోటిపడి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని హుస్నాబాద్ నియెజకవర్గం సస్యశ్యామలంగా ఉ ండేందుకు రైతుల ఇండ్లలో వెలుగులు నింపడానికి గౌరవెల్లి రిజర్వాయర్ ను పూర్తి చేయడం జరిగిందని హుస్నాబాద్ నియెజకవర్గ మిట్టప్రాంతాలకు దేవాదుల ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందించారని అందువల్ల సతీష్ కుమార్ కారుగుర్తుకు ఓటువేసి మళ్లీ గెలిపిస్తే ఈసారి సతీష్ కుమార్ మంత్రి పదవి చేపట్టి హుస్నాబాద్ నియెజకవర్గం మరింత అభివృద్ధి చేపడతారని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రైతుసమన్వయ కమిటీ అధ్యక్షులు రుద్రారపు రవితేజ, గ్రామశాఖ అధ్యక్షులు ఎరుకొండ శ్రీనివాస్, మాజీ యంపిటిసి వేముల నారాయణ, మాజీ సర్పంచ్ చిట్టి ప్రకాష్ రెడ్డి, రుద్రారపు కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# లిటిల్ జీనియస్ హైస్కూల్లో బాలల దినోత్సవం

కోరుట్ల నవంబర్ 14 (ప్రజామంటలు): స్థానిక లిటిల్ జీనియస్ హై స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆట పాటల తో, ఉపాధ్యాయులుగా మారి పాఠాలు భోదించారు. ఉపాధ్యాయులగా గురించి విద్యార్థులు ఉపన్యాసం అందరిని ఆకట్టు కొంది. పాఠశాల కరస్పాండెంట్ బండి మహాదేవ్ విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడుతూ.... నేటి బాలలే రేపటి పౌరులని దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధార పడిందని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ కలకుంట్ల రాధా కృష్ణ, డైరెక్టర్స్ కటుకం శంకర్, రాజు వినోద ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# కమలాపూర్ లో బిజెపి కి షాక్..

## బిఆర్ఎస్ లో భారీ చేరికలు..



జమ్మికుంట నవంబర్ 14 (ప్రజామంటలు): హుజురాబాద్ నియోజకవర్గం లోని కమలాపూర్ మండలంలో బిజెపికి భారీ షాక్ తగిలింది. బిజెపి నుంచి చాలామంది నాయకులు మంగళవారం బిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పుకున్నారు. దేశరాజు పల్లి గ్రామంలోని బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండి పాషా, కార్యదర్శి ఒగ్గోజు సదయ్య, బూతు అధ్యక్షుడు కృష్ణ, లతోపాటు కొంతమంది నాయకులు బిఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి చూసి ఆకర్షితులైన చాలామంది టిఆర్ఎస్ పార్టీలోకి వస్తున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరు బాగా స్వామ్యం కావాలని ఆయన కోరారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర రథసారధి కెసిఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ లో చేరమన్నారు. అలాగే హుజురాబాద్ నియోజకవర్గం జరగాలంటే కౌశిక్ రెడ్డి తోనే సాధ్యమని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం అభివృద్ధిలో తమ వంతు కృషి కూడా చేయాలని ఆలోచనతోనే బిజెపిని వీడి బిఆర్ఎస్ లో చేరామని అన్నారు. అలాగే పంగిడిపల్లి గ్రామంలో కూడా బిజెపి, కాంగ్రెస్ నుంచి నాయకులు బిఆర్ఎస్ లో చేరారు.

# ఇటు అనాధలకు 240 వ అన్నదానం

## అటు ప్రజలకు ఓటు గురించి అవగాహన





పద్మారావు నగర్ నవంబర్ 14 (ప్రజామంటలు): వాహనంలో సంచరిస్తూ నగరంలో రోడ్ల పక్కన ఫుట్ పాత్ లపై జీవనం సాగిస్తున్న అనాథలు నిరాశ్రయులు, మతి స్థిమితం కోల్పోయి ఆకలితో ఉన్నవారిని గుర్తించి 240వ అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. ఇదే సందర్భంగా అక్కడ ఉన్న ప్రజలకు ఓటు హక్కు వినియోగం గురించి ప్లకార్డ్స్ తో ప్రదర్శన నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమములో ప్రెసిడెంట్ వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ. పావని, సభ్యులు నేహా, హరీష్ కుమార్, ఇర్ఫాన్, అరుణ్ కుమార్, సాయికిరణ్, శుభం మొదలగు వాళ్ళు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ గడ్డ బిఆర్ఎస్ అడ్డ

## సతీష్ గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం

## ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి



చిగురుమామిడి నవంబర్ 14 (ప్రజామంటలు): మండలంలో భారత రాష్ట్ర సమితి ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతుంది బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీషన్న గెలుపే లక్ష్యంగా మండల పార్టీ కార్యవర్గం ఎక్కడిక్కడ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తుంది. చిగురు మామిడి మండలం లో రైతు, కూలీల దగ్గరికి వెళ్లి రైతులకు మహిళలకు బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు మరియు పార్టీ మేనిఫెస్టో ని వివరించారు. ఈనెల 30 వ తేదీన జరుగబోయే శాసనసభ ఎన్నికల్లో కారు గుర్తుపైన ఓటు వేసి ఎమ్మెల్యే ని గెలిపించుకోవాలన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది అంటే అది కేవలం ఎమ్మెల్యే కృషి పట్టుదల అని ఒప్పుకోక తప్పదని అన్నారు. ఈ నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారంటే ఎమ్మెల్యే కి ఈ ప్రాంత ప్రజల మీద ఉన్న ప్రేమ ఎట్టిదో చెప్పనవసరం లేదు. మళ్ళొక్కసారి మన ఎమ్మెల్యే ని గెలిపించుకుని అభివృద్ధి ని కొనసాగించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎంపిపి కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మామిడి అంజయ్య, సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు ఆకవరం మఠం శివప్రసాద్, ఉపసర్పంచ్ పద్మ,మాజీ వైస్ ఎంపిపి ఆకవరం మఠం భవాని,పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి చెప్యాల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు,మైనారిటీ సెల్ అధ్యక్షులు సర్వర్ పాషా, గ్రామశాఖ మాజీ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, యువజన విభాగం ఉపాధ్యక్షులు ముంజ ప్రకాష్ గౌడ్, మహిళా నాయకులు గొల్లపల్లి అరుణ, తిరుమల నాయకులు తాళ్లపల్లి తిరుపతి, ధర్మేందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# ధర్మపురి దేవస్థానంలో ఎన్నికల పరిశీలకులు



ధర్మపురి నవంబర్ 14 (ప్రజామంటలు): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని మంగళ వారం ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ బసవ రాజేంద్ర, రాజీవ్ మీనన్, పోలీస్ అబ్జర్వర్ వివేకానంద్ సింగ్ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం పక్షాన మేళతాళాలతో స్వాగతం పలికి పూజల అనంతరం అర్చకులు ఆశీర్వదించాక దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ శేషవస్త్రం ప్రసాదం ఇచ్చి సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముత్యాల శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ముఖ్య అర్చకులు రమణయ్య, సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

# చిన్నపిల్లలను విమర్శించడం తుమ్మేటికి తగదు

## జమ్మికుంట మాజీ మార్కెట్ చైర్మన్ పోల్నేని సత్యనారాయణ రావు



జమ్మికుంట నవంబర్ 14 (ప్రజామంటలు): మంగళవారం విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ చైర్మన్ పోల్నేని సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గంలో మా టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కౌశిక్ రెడ్డి భార్య, కూతురు ప్రజలను ఓట్లు అడుగుతున్నారు. మా నాన్నకు ఓటేయండి అని అంటున్న కూతురు దీంట్లో తప్పేముంది. దీనిపై కూడా తుమ్మేటి సమ్మి రెడ్డి అనే నియోజవర్గానికి సంబంధం లేని వ్యక్తి నాన్ లోకల్ వ్యక్తి చిన్నపిల్లల తోటి ఓట్లు అడుగుతున్నారు. బాల కార్మిక చట్టం కింద కేసు బుక్ చేయాలి అని అనడం సిగ్గుచేటు. తండ్రి కోసం బిడ్డ ఓట్లు అడగటంలో తప్పేముంది ఇది కరెక్ట్ కాదు ఇప్పటికైనా దుష్ప్రచారం మానుకోవాలి. కుటుంబ సభ్యులు ఎవరికైనా ఓటు అడిగే హక్కు ఉంటది. దీన్ని కూడా రాజకీయం చేయడం కరెక్ట్ కాదు. అయినా నువ్వు మా నియోజకవర్గానికి సంబంధించిన వ్యక్తివే కాదు. నీకు ఏం అవసరం. ఇంకొకసారి ఇటువంటి చిల్లర మల్లారం మాటలు మాట్లాడితే నియోజకవర్గము నుండి తరిమికొడతాం అంటూ జమ్మికుంట మాజీ మార్కెట్ చైర్మన్ పోల్నేని సత్యనారాయణ హెచ్చరించారు.

# వైభవంగా గోదావరి హారతి ప్రారంభం

## గోదావరికి దొప్పలలో దీపాల సమర్పణ

(రామ కిష్టయ్య సంగన భట్ల)



ధర్మపురి నవంబర్ 14 (ప్రజామంటలు): కార్తీకమాసం సందర్భంగా గోదావరి హారతిలో బాగంగా ప్రారంభదినమైన మంగళవారం దేవస్థానం ఏ సీ, ఈ ఓ సంకటాల శ్రీనివాస్ దర్శకత్వంలో, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ రామయ్య పర్యవేక్షణలో, వేద పండితులు అర్చకులు సిబ్బంది, ప్రధానంగా మహిళలు తోడు రాగా, శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి ఆలయం నుండి మేళతాళాలతో, మంగళ వాద్యాలతో, నేపథ్య సంగీతంతో, గోదావరి నదివరకు చేరుకున్నారు. దేవస్థాన ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేశ్ శర్మ, ముత్యాల శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, అర్చకులు నేరేళ్ల శ్రీనివాసాచార్యులు, నంబి శ్రీనివాసాచార్యులు, అరుణ్, సంతోష్, కుమార్, రాజ గోపాల్ శర్మ, నవీన్, కళ్యాణ్ తదితరులు పుణ్యాహ వాచనం, కలశ గణపతి విష్వక్సేన పూజ, గోదావరి మాత అర్చన, షోడశోపచార పూజలు, మంత్ర పుష్పం ఆదిగా విశేష పూజలు గావించిన అనంతరం గోదావరి నదికి హారతులు సమర్పించి, నదిలో దీపాలు సమర్పించడం జరిగింది. కార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, తిరుపతి, సురేశ్, వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు. కార్తీక మాసం తొలి రోజు నిర్వహించే సాంప్రదాయ గోదావరి హారతి కార్యక్రమంలో, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ రామయ్య మినహా, సభ్యులు ఎవరూ పాల్గొనక పోవడం చర్చనీయాంశమైంది.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఒడితల ప్రణవ్ గెలుపు కోసం తల్లి ప్రచారం

జమ్మికుంట నవంబర్ 14 (ప్రజామంటలు): హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఒడితల ప్రణవ్ గెలుపు కోసం మంగళవారం తన తల్లి పద్మశ్రీ జమ్మికుంట మున్సిపల్ పరిధిలో పలు వార్డులలో తిరుగుతూ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఓటర్ మహాశయులకు విజ్ఞప్తి చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు పేదల బతుకులు మార్చే విధంగా ఉన్నాయని తన కొడుకు ఒడితల ప్రణవ్ కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు. ప్రచారంలో తమ వెంట జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కసు బొజ్జుల వెంకన్న, సుంకరి రమేష్, పూదరి రేణుక, సలీం పాషా, రవి, శ్రీనివాస్, పూదరి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



prajamantalau daily pages (15-11)_times of varha main (13-2).qxd 11/15/2023 12:56 AM Page 7



## హాయ్ నాన్న స్టిల్ విడుదల



టాలీవుడ్ మోస్ట్ ప్రామిసింగ్ హీరోల్లో ఒకరు న్యాచురల్ స్టార్ నాని ప్రస్తుతం హాయ్ నాన్న సినిమా చేస్తున్నాడని తెలిసిందే. తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో నాని 30 (ఔజీనితి 30)గా తెరకెక్కుతున్న ఈ మూవీకి శౌర్యువ్ (÷ూరనీబీసాబీల) (డెబ్యూ డైరెక్టర్) దర్శకత్వం వహిస్తున్నాడు. మృణాళ్ ఠాకూర్ (ఓసబీనిజీ ÷ురజీబీస) హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 7న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో నాని టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. తాజాగా బోటు షికారు చేస్తున్న స్టిల్‌ను షేర్ చేశాడు నాని. ప్రతీ సీన్ వెనుక ఓ కథ ఉంటుంది..అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. ఇప్పుడీ ఫొటో నెట్టింట హల్ చల్ చేస్తోంది. నాని మరోవైపు హాయ్ నాన్న విడుదల కాకముందే కొత్త సినిమా నాని 31 అప్‌డేట్ కూడా ఇచ్చాడని తెలిసిందే. ఈ మూవీని వివేక్ ఆత్రేయ డైరెక్ట్ చేస్తున్నాడు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో టాలెంటెడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఎస్‌జే సూర్య విలన్‌గా నటిస్తున్నాడు. హాయ్ నాన్న డిసెంబర్ 9న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే హాయ్ నాన్న నుంచి లాంఛ్ చేసిన పాటలు, టైటిల్ గ్లింప్స్, గ్లింప్స్ వీడియో సినిమాపై అంచనాలు పెంచుతున్నాయి. ఈ మూవీలో మృణాళ్ ఠాకూర్ యశ్న పాత్రలో నటిస్తోండగా.. బేబి కైరా ఖన్నా నాని కూతురుగా నటిస్తోంది. హాయ్ నాన్న నుంచి రిలీజ్ చేసిన హర్ట్ టచింగ్ ట్యూన్స్, పాటలు సినిమాపై సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మోహన్ చెరుకూరి (అ÷ఎఓ), డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల, మూర్తి కేఎస్ తెరకెక్కిస్తున్నారు.

## మల్టీస్టారర్‌పై కన్నేసిన జవాన్ దర్శకుడు అట్లీ

జవాన్’తో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను అలరించిన దర్శకుడు అట్లీ ప్రస్తుతం తదుపరి చిత్రం గురించే ఎక్కువ చర్చ నడుస్తోంది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అట్లీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దళపతి విజయ్, షారుక్‌తో ఓ మల్టీస్టారర్ చిత్రం తీసేందుకు రెడీ అవుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ మలీస్టారర్ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌తో బిజీగా ఉన్నాం. త్వరలోనే ఇది తెరకెక్కే అవకాశాలున్నాయి. తాజాగా ఓ పార్టీలో విజయ్, షారుక్ ఖాన్ సీబీర నా సినిమాల గురించి మాట్లాడుకొని నాకు ఫోన్ చేశారు. మల్టీస్టారర్ తీసే ఆలోచన ఉంటే.. అందులో తాను నటించడానికి ఆసక్తిగా ఉన్నట్లు షారుక్ చెప్పారు. అలాగే విజయ్ కూడా ఇదే మాట అన్నారు. అందుకే వాళ్లిద్దరితో ఓ మల్టీస్టారర్ చేయాలని నిర్ణయించుకున్నా. ఇదే నా తదుపరి చిత్రం అవుతుంది. రూ.3000 కోట్లు వసూళ్లు చేసే చిత్రమవుతుంది. ఈ ఇద్దరిలో ఎవరు ముఖ్యమంటే నేను చెప్పలేను. ఈరోజు నేను ఈ స్థాయిలో ఉండడానికి తొలి కారణం విజయ్.. నాపై నమ్మకంతో అవకాశాలిచ్చారని అట్లీ అన్నారు. అంతేకాదు హాలీవుడ్ నుంచి ఓ ప్రముఖ స్టూడియో తనను సంప్రదించినట్లు, ప్రస్తుతం ఆ పనులు కూడా జరుగుతున్నట్లు అట్లీ చెప్పారు.

# మళ్లీ దీపిక సెక్సీ మెరుపులు





బాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ బ్యూటీ దీపికా పదుకొణెలి ఇన్ స్టా సంచనాల గురించి చెప్పాల్సిన పనిలేదు. సక్సెస్ అయ్యాను కదా? అని కామ్ గా కూర్చుంటే పనవ్వదని అమ్మడికి బాగా తెలుసు. అందుకే నవతరం నాయికల తోనూ బ్యూటీ విషయంలో పోటీ పడుతుంది. ఎప్పటికప్పుడు అప్ డేట్ అవుతూ తనదైన ప్రత్యేకతని చాటుతుంది. ఆల్ట్రా స్టైలిష్ లుక్ లో అమ్మడు కొలువు దీరే విధానం గురించైతే మరో ముచ్చట అవసరం లేదు. క్యాలెండర్ గార్ల్ గా పాపులర్ అయిన తెరంగేట్రం చేసిన హీరోయిన్ కా బట్టి మ్యాగజైన్ కవర్ పేజీల కోసం ఏ రేంజ్ లో సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో గెస్ చేయొచ్చు. ఇప్పటికే పలు కవర్ పేజీలపై అందాలు ఆరబోసిన అమ్మడు మరోసారి ప్రఖ్యాత వోగ్ ఇండియా మ్యాగజైన్ పై తళుక్కున మెరిసింది. షూట్ తోకాకుండా ఏకంగా మ్యాగజైన్ తో నెటి జనుల ముందుకొచ్చింది. ఇదిగో ఇక్కడిలా బ్లాక్ కలర్ డిజైన్డ్ దుస్తుల్లో అమ్మడు సెగలు పుట్టిస్తూ కెమెరాకి ఫోజులిచ్చింది. చరణ్ - మహేష్.. ఎంత క్లోజ్ ఫ్రెండ్స్ అంటే.. షోల్డర్ లెస్ గౌను అమ్మడిని హైట్ అంతే గొప్పగా ప్రొజెక్ట్ చేస్తుంది. ఒక చేతిని హిప్ పై ..మరో చేతిని మోకాలిపై బ్యాలెన్స్ చేస్తూ బాడీని కాస్త బెండ్ చేస్తూ ఇచ్చిన భంగిమ ఆకర్షణీయంగా ఉంది. ఈ షూట్ కోసం దీపిక ఎంపిక చేసుకన్న యాక్సరీస్..జ్యువలెరీ మరింత అందాన్ని జోడించాయి. దీపిక పెదాలపై ఎర్రటి లిప్ స్టిక్ ..మ్యాకప్ ప్రతీది అమ్మడిని మరింత అందంగా మలిచాయి. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. ఇక దీపిక సినిమాల సంగతి చూస్తే..బాలీవుడ్ మినహాయిస్తే తెలుగులో పాన్ ఇండియా చిత్రం కల్కితో తెరంగేట్రం చేస్తుంది. ఇందులో ప్రభాస్ కి జోడీగా నటిస్తుంది. భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోన్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో దీపిక నటన ప్రత్యేకంగా ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతుంది

## దేవర తాజా షెడ్యూల్ ప్రారంభం

### జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం దేవర కొరటాల శివ డైరెక్ట్ చేస్తున్నాడు. ఫిషింగ్

హార్బర్ విలేజ్, పోర్ట్ మాఫియా నేపథ్యంలో తెరకెక్కుతున్న దేవర షూటింగ్ దశలో ఉంది. గోవాలోని సెట్స్‌లో దేవర అండ్ గ్యాంగ్‌పై వచ్చే చిన్న సెలబ్రేషన్ మ్యూజిక్ బిట్‌ను షూట్ చేసినట్టు ఇటీవలే తారక్ అభిమానులకు మంచి కిక్ ఇచ్చే అప్‌డేట్ అందించింది కొరటాల టీం. షూట్ సందర్భంగా తారక్ సెట్స్‌లో డ్యాన్సర్లతో కలిసి దిగిన ఫొటోలు కూడా నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా మరో ఇంట్రెస్టింగ్ వార్త షేర్ చేసి ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తున్నారు మేకర్స్. దేవర నయా షెడ్యూల్ శంషాబాద్‌లో షూటింగ్ షురూ అయింది. అక్కడి నుంచి రామోజీఫిలిం సిటీకి వెళ్లనుంది తారక్ టీం. జూనియర్ ఎన్టీఆర్‌తోపాటు ఇతర కీలక నటీనటులు తాజా షూట్‌లో పాల్గొంటున్నట్టు ఇన్‌సైడ్ టాక్. దేవరలో తారక్ నుంచి ఫ్యాన్స్ ఆశిస్తున్న ఊర మాస్ ఎలిమెంట్స్ సినిమాలో ఉండబోతున్నట్టు ఫస్ట్ లుక్‌తోపాటు బయటకు వచ్చిన స్టిల్స్ చెప్పకనే చెబుతున్నాయి. దేవరలో బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీఖాన్ భైర పాత్రలో (విలన్‌గా) నటిస్తున్నాడు. ప్రకాశ్ రాజ్, ÷న్ టామ్ ఛాకో, శ్రీకాంత్, మురళీ శర్మ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రంతో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. వీఎఫ్ఎక్స్ పనుల కారణంగా సినిమా అనుకున్న ప్రకారం ఆలస్యం కాకుండా.. క్లైమాక్స్ పోర్షన్‌ను కొరటాల టీం ముందుగానే షూట్ చేసినట్టు సమాచారం. దేవరలో ఎన్టీఆర్‌పై వచ్చే అండర్‌వాటర్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్ కానుందట. మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తోన్న ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. దేవర రెండు పార్టులుగా రాబోతుండగా.. దేవర పార్ట్ 1 ప్రపంచవ్యాప్తంగా 2024 ఏప్రిల్ 5న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.




# సెమీ-ఫైనల్‌లో టాస్ దే ప్రత్యేక పాత్ర



ఈ ప్రపంచకప్‌లో టీమిండియా ఇప్పటి వరకు అద్భుతమైన ప్రదర్శన చూపించింది. లీగ్ దశలో అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి భారత్ సెమీఫైనల్‌కు చేరుకుంది. అయితే సెమీస్‌లో టీమిండియా రికార్డుల పరంగా చూసుకుంటే అంత మెరుగ్గా లేవు. 2015 ప్రపంచకప్ సెమీ-ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాపై, 2019 ప్రపంచకప్ సెమీ-ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌పై భారత్ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఈసారి కూడా తొలి సెమీ ఫైనల్ లో టీమిండియా న్యూజిలాండ్‌తో తలపడనుంది. ఇలాంటి క్రమంలో టీమిండియా టాస్ గెలిస్తే ముందుగా ఏం చేయాలి అనే ప్రశ్న టీమిండియా అభిమానులందరిలో మెదులుతోంది. అయితే.. ఈ ప్రశ్నపై టీమిండియా మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా ఓ సలహా ఇచ్చాడు. ఈ బిగ్ మ్యాచ్‌లో పరుగులను ఛేజ్ చేయడం ఎప్పుడూ కష్టమేనని తన వీడియోలో చెప్పాడు. అంతేకాకుండా.. మొదట బ్యాటింగ్ చేస్తే భారత్ ఆలౌట్ అవుతుందని చెప్పాడు. వాంఖడేలో మంచు కురిసిన తర్వాత పరుగులను ఛేజింగ్ చేయడం ఎప్పుడూ కష్టమే, కానీ టీమిండియా ఇంతకుముందు ఆ పని చేసింది అని అన్నాడు. అయితే.. సెమీ-ఫైనల్ వంటి కీలక మ్యాచ్‌లో టాస్ ప్రత్యేక పాత్ర పోషించదని ఆకాష్ చోప్రా కూడా అభిప్రాయపడ్డాడు. టీమిండియా ముగ్గురు ఫాస్ట్ బౌలర్లతో ఆడుతున్నారు కావున.. న్యూజిలాండ్‌ను రెండో ఇన్నింగ్స్‌లో ఓడించగలరని భావిస్తున్నట్లు తెలిపాడు. అదే విధంగా.. ధర్మశాలలో జరిగిన మ్యాచ్‌లో కూడా న్యూజిలాండ్ పై ఫస్ట్ బ్యాటింగ్ చేసి, ఆ తర్వాత పరుగులు కట్టడి చేసి వికెట్లను పడగొట్టారు. దీంతో ఆ మ్యాచ్ లో టీమిండియా ఘన విజయం సాధించింది. ఏదేమైనప్పటికీ ఈ మ్యాచ్‌లో గెలిచి ఫైనల్స్‌కు వెళ్లబోతున్నామని ఆకాశ్ చోప్రా ఆశాభావం వ్యక్తం చేశాడు.

# భారత్ తానుగా ప్రత్యేకంగా ఓ టాస్క్ పెట్టుకుంది

## వరుస విజయాలపై కోచ్ రాహుల్ ద్రవిడ్ వ్యాఖ్యలు

వరల్డ్‌కప్ 2023లో భారత్ విజయాలతో దూసుకెళ్తుంది. లీగ్ మ్యాచుల్లో ఆడిన 9 మ్యాచ్?ల్లో ఓటమెరుగని జట్టుగా నిలిచి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో జట్టు వరుస విజయాలపై కోచ్ రాహుల్ ద్రవిడ్ కారణం వివరించాడు. జట్టు తనకు తానుగా ప్రత్యేకంగా ఓ టాస్క్ పెట్టుకుందని తెలిపాడు. విజయాల వైపు జట్టును నడిపించేందుకు ఓ స్పెషల్ మిషన్‌ను ఇచ్చినట్టు చెప్పాడు. స్టార్ స్పోర్ట్స్ తో జరిగిన కార్యక్రమంలో కోచ్ రాహుల్ ద్రవిడ్ మాట్లాడుతూ.. “ప్రపంచకప్ కోసం కొన్ని సవాళ్లు సిద్ధం చేసుకున్నాం. తొమ్మిది నగరాల్లో జరిగిన మ్యాచుల్లో అభిమానులు బాగా సపోర్ట్ చేశారు. వీలైనంత బాగా ఆడాలని, మంచి ప్రదర్శన కనబర్చాలని అనుకున్నాం. యువ ఆటగాళ్లు కూడా చక్కగా రాణించారు” అని ద్రావిడ్ చెప్పుకొచ్చాడు. ఇదిలా ఉంటే.. సెమీస్‌కు ముందు ఆరు రోజుల విశ్రాంతి దొరకడం, తమకు బాగా కలిసి వచ్చిందని ద్రవిడ్ అన్నాడు. మరోవైపు జట్టులోని ఐదుగురు బ్యాటర్లు అద్భుతంగా ఆడుతున్నారని, అంతేకాకుండా.. ఇద్దరు ముగ్గురు శతకాలు బాదుతున్నారని కొనియాడాడు. ఇక బౌలింగ్ విభాగంలో కూడా.. మంచిగా రాణిస్తున్నారని చెప్పాడు. మరీ ముఖ్యంగా మిడిలార్డర్ అద్భుతంగా ఆడుతున్నారని ప్రశంసించాడు. టాపార్డర్ లో కూడా పరుగులు వస్తున్నాయని తెలిపాడు. లీడర్‌బోర్డులో రోహిత్, కోహ్లీ పరుగుల సునామీ సృష్టిస్తున్నారని, వారు అద్భుతంగా ఆడుతున్నారని ద్రవిడ్ ప్రశంసించాడు.



## బీఎస్పీ ప్రచార రథాన్ని పోలీసులు సీజ్ చేయడం కరెక్ట్ కాదు

### బీఎస్పీ హుజురాబాద్ నియోజకవర్గం ఇన్చార్జ్ వాసాల రామస్వామి



**జమ్మికుంట నవంబర్ 14 (ప్రజామంటలు):** జమ్మికుంట మండల కేంద్రంలోని హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వాసాల రామస్వామి ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ..... బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థీ ప్రశాంత్ గౌడ్ ప్రతి ఇంటికి ఏనుగు గుర్తు బహుజన్ సమాజ్ పార్టీ నీలి జెండాతో అబాది కేషవపూర్ జమ్మికుంటలో కాళీ నడకతో ప్రచారం నిర్వహించిడం జరిగింది. మాపై జమ్మికుంట సర్కిల్ ఇన్స్పెక్టర్ పగపట్టి మా బహుజన సమాజ్ పార్టీ ప్రచార వాహనాన్ని అన్ని పర్మిషన్స్ ఉన్నప్పటకి కూడా సౌండ్ ఎక్కువ వస్తుందని. మా వాహనాన్ని కసితో సీజ్ చేసినారు మాది బహునుల పార్టీ పైసలు లేని ప్రజల పార్టీ. మేము వాహనాల మీద ప్రచారం చేయవద్దని కక్షతో ఇబ్బంది పెడుతూ దొరల పార్టీలు గాంధీ కాడ పోలీస్ స్టేషన్ పక్కన డీజే తో ప్రచారం చేసిన పట్టించుకోని సర్కిల్ ఇన్స్పెక్టర్ మాపై మాత్రం బాగా కక్ష పెంచుకొని పట్టించుకుంటున్నాడు ఇది ప్రజలు గమనించగలరని మేధావులు కవులు కళాకారులు గమనించగలరని వివరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వాసాల రామస్వామి, ఇల్లంతకుంట మండలం అధ్యక్షుడు మంద శివ శంకర్, వీణవంక మండల అధ్యక్షుడు కొంగల కుమార్, రంజిత్ శ్రీనివాస్, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో చిల్డ్రన్స్ డే వేడుకలు

**సికింద్రాబాద్ నవంబర్ 14 (ప్రజామంటలు):** జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా న్యూ బోలాక్పూర్ లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో మంగళవారం చిల్డ్రన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సరీ ఎల్కేజీ యూకేజీ చిన్నారులకు వ్యాసరచన డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు, టీచర్లు, సిబ్బంది, పేరెంట్స్ పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com